
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 203 | హైదరాబాద్ | మంగళవారం 03-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

ఇండియా గేట్ ఫొటో షేర్ చేసిన ట్రంప్...
'ట్రూత్ సోషల్'లో ఆసక్తికర వ్యాఖ్యలు



11లో

ఏపీ, తెలంగాణలకు

## హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..

- బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు: అశ్వినీ వైష్ణవ్
- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై

## కవిత కీలక వ్యాఖ్యలు

- సిట్ పిలిస్తే విచారణకు వెళతానన్న జాగృతి అధ్యక్షురాలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్



11లో

రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి

# వైకాపా కుట్రలు

- అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు
- ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు
- లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది
- అందుకే ఫ్రస్టేషన్‌లో నానా యాగీ చేసే ప్రయత్నాలు
- వైకాపా కుట్రలతో టిడిపి నేతలు జాగ్రత్తగా ఉండాల్సిందే
- పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

11లో





11లో

తెలుగు రాష్ట్రాల్లో

## పులి సంచారం కలకలం

- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం
- తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన
- అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక
- పులిని పట్టుకునేందుకు బోను, సిసి కెమెరాల ఏర్పాటు

కాంగ్రెస్ ప్రభుత్వానికి

## సుప్రీంలో ఎదురుదెబ్బ

- సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ



ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్‌కు అలాగే వచ్చింది: కేటీఆర్

11లో

అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి

## వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా

- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సిఎం రేవంత్
- రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు




11లో

చట్టం కోవెలలో..

# చీకటి నీడలా?

ఒక ఊరిలో అందరికీ నీతులు చెప్పే పెద్దలందరూ కలిసి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారట. ఆ సంఘం ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో తెలియక జనం అయోమయంలో పడ్డారు. "అయ్యా! మీలో ఎవరిపై ఏ ఏ కేసులు ఉన్నాయో చెబితే, మంచి వ్యక్తిని ఎంచుకుంటాం" అని ఓటరు అడిగితే.. "మేము చట్టాన్ని రక్షించే జ్ఞానులం, మా చిట్టా అడిగే హక్కు నీకు లేదు" అని గద్దించారట. పక్కనే ఉన్న ఒక పిట్ట ఇది విని, "అద్దాల మేడలో ఉండి పక్కవాడిపై రాళ్లు విసరడం అంటే ఇదేనేమో.. ఎదుటివారికి ఏకరువు పెట్టే నీతులు, వీరికి మాత్రం వర్తించవా?" అని నవ్వుకుంటూ ఎగిరిపోయింది.



- న్యాయవాద ఎన్నికల్లో 'నేర చరిత్ర' గోప్యతపై హైకోర్టు గడప తొక్కిన నిరసన
- ప్రజాప్రతినిధులకే వర్తించే నిబంధనలు.. 'నల్లకోటు' యోధులకు వర్తించవా?
- ఓటరుకు తెలియకూడదా అభ్యర్థి నేపథ్యం? బార్ కౌన్సిల్ తీరుపై న్యాయపోరాటం..

12లో

భారత శక్తి

# విమాన ప్రమాదాలకు అంతం ఎప్పుడు

ఆది అంతమూ లేని ఆకాశాన్ని.. అసలైన స్వేచ్ఛకు ప్రతీకగా మనం భావిస్తూ ఉంటాం. అయితే.. సమున్నతంగా, అనంతంగా వ్యాపించిన ఆ నీలి ఆకాశమే.. జాతిని ముందుకు నడపాల్సిన విలువైన వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా చిదిమేసినప్పుడు కలిగే దుఃఖం మాటల్లో చెప్పలేనిది. తనను నమ్ముకున్న అనుచరులు పోటీ చేస్తున్న చోట ప్రచారానికో, దగాపడిన ప్రజలకు ధైర్యం చెబుదామనో, దేశప్రగతిని పట్టాలెక్కించే మరో కార్యక్రమం కోసమో.. విమానంలోనో, హెలికాప్టర్‌లోనో బయలుదేరిన నేతలు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయినప్పుడు.. అది చెప్పలేని విషాదంగా పరిణమిస్తుంది. దేశ గమనాన్ని మార్చి, కోట్లాది జాతిజనుల కలలకు ప్రతీకలుగా నిలిచిన ఆ వ్యక్తులు ఈ ప్రపంచం నుంచి మాయమైన తీరు.. ఒక తరానికి పీడకలగానే నిలిచిపోతుంది. భారతప్రజాస్వామ్య చరిత్రలో అలాంటి అత్యంత విషాదకరమైన పీడకలలు ఎన్నో ఉన్నాయి. అశేష ప్రజానీకానికి ఆరాధ్య దైవాలుగా నిలిచిన ఆ నేతల చివరి ప్రయాణాలను తలచుకుంటే.. నేటికీ గుండె బరువెక్కక మానదు. ఈ జాబితాలో ప్రజల మనసులు గెలిచిన నాయకుల నుంచి అన్ని రంగాల ప్రముఖులూ ఉన్నారు. విమాన ప్రమాదాలు అనగానే తెలుగువారికి ముందుగా కొన్ని పేర్లు గుర్తుకు వస్తాయి. వారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరు. చిన్న రైతు కుటుంబంలో పుట్టిన నాయుడమ్మ అంతర్జాతీయ స్థాయి రసాయన శాస్త్రవేత్తగా ఎదిగారు. అప్పట్లో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీకి సలహాదారుగా పనిచేసిన ఆయన, ఐక్యరాజ్యసమితితోపాటు పలు అంతర్జాతీయ సంస్థలకు, విదేశీ సంస్థలకు కూడా సలహాదారుగా పనిచేశారు. కెనడాలోని ఐడిఆర్‌సి సమావేశానికి హాజరై 1985 జూన్ 23న తిరిగి వస్తున్న క్రమంలో ఆ ఎయిర్ ఇండియా పేలిపోవటంతో కన్నుమూశారు. ఈ వార్త వినగానే.. ఆయన భార్య డాక్టర్ పవన ఆత్మహత్య చేసుకుని మరణించటం మరో విషాదం. ఇలాంటి విషాద వార్తలు వినగానే తెలుగువారికి ఎపి మాజీ సిఎం రాజశేఖరరెడ్డి, నాటి లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి, సినీ నటి సౌందర్య మరణాలు గుర్తుకు రాకుండా ఉండవు. లోక్‌సభ మాజీ స్పీకర్, టిడిపి నేత జిఎంసి బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ హెలికాప్టర్, కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని ఓ చెరువులో కూలిపోయింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత తెలుగువారికి ఎంతో సుపరిచితురాలైన ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఇక.. తెలుగు రాష్ట్రాల ప్రజల జనహృదయ నేతగా పేరు తెచ్చుకున్న నేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 14 వ సిఎంగా పనిచేసిన వైఎస్ఆర్.. 2009, సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్రంగా కలచివేసింది. విమాన ప్రమాదంలో దేశం కోల్పోయిన మరో మేధావి హోమీ జహంగీర్ బాబా. 1966 జనవరి 24న జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఈ ప్రపంచ ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అకాల మరణం చెందారు. 1980 జూన్ 23న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన విమానాన్ని నడుపుతూ, ప్రమాదకర విన్యాసాలు చేయడానికి ప్రయత్నించగా, విమానం కూలిపోయింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి మాధవరావు సింధియా 2001 సెప్టెంబర్ 30న విమాన ప్రమాదంలో మృతి చెందారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా, ఆయన ప్రయాణిస్తున్న విమానం ఉత్తరప్రదేశ్ మైన్‌పురి సమీపంలో కూలిపోయింది. అలాగే, ప్రముఖ పారిశ్రామికవేత్త, హర్యానా మంత్రి ఓంప్రకాశ్ జిందాల్ 2005 మార్చి 31న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 2011 ఏప్రిల్ 30న తవాంగ్, ఇటానగర్ మధ్య జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి అరుణాచల్‌ప్రదేశ్ సిఎం దోర్జి ఖండు దుర్మరణం చెందారు. భారతదేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో బిపిన్ రావత్ భార్యతోపాటు మరో 11మంది మరణించారు. నిరుడు జూన్ నెలలో దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మరణించారు. ఇలా వరుసగా జరుగుతున్న విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు చరిత్రలో చెరగని విషాద ఘట్టాలుగా నిలిచిపోయాయి. తాజాగా, బుధవారం ఉదయం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఈ వార్త విని యావత్ దేశంగ్భ్రాంతికి గురైంది. ముంబై నుంచి తన సొంత నియోజకవర్గం బారామతిలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం బయల్దేరినప్పటి నుంచి రెండుసార్లు సిగ్నల్స్ కట్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటాలో తేలింది. ఉదయం 8:10 గంటలకు ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన విమానం, ప్రారంభంలో 6 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించింది. 8:34 నిమిషాలకు మొదటిసారి సిగ్నల్స్ ఆగిపోయి, కొద్దిసేపటి తర్వాత మళ్లీ కనెక్ట్ అయ్యాయి. అయితే, 8:43 నిమిషాలకు బారామతి ఎయిర్‌పోర్ట్‌కు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ పూర్తిగా నిలిచిపోయాయి.

# ఉగాదికి జాబ్ క్యాలెండర్

విజయవాడ, ఫిబ్రవరి 2,

ఈ ఏడాది మార్చి?ఏప్రిల్ మధ్య జరిగే తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా వినియోగించుకోనుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఉగాది రోజున ఒక కీలక ప్రకటన చేయడానికి సిద్ధమవుతున్నారన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. గతంలో కూడా పెద్ద నిర్ణయాలు, అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో ముందుగానే ప్రజలకు సంకేతాలు ఇచ్చిన లోకేశ్, ఈసారి కూడా అదే తరహా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తోంది. ఈ క్రమంలోనే పెట్టుబడులను ఆకర్షించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు దాదాపు 23 లక్షల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాలపై కూడా సమీక్ష జరిపినట్టు తెలుస్తోంది. పోలీస్, రెవెన్యూ సహా వివిధ విభాగాల్లో కలిపి 23 వేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఏయే శాఖల్లో ఎంతమంది అవసరమో వివరాలతో కూడిన జాబితాను అధికారులు సిద్ధం చేసినట్టు సమాచారం. అంతేకాదు, ఈ ఏడాది రిటైర్ కానున్న ఉద్యోగుల వివరాలను కూడా ముందుగానే పరిశీలించి, ఆ స్థానాలు ఖాళీ కాకముందే భర్తీ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెబుతున్నారు. ఈ మొత్తం ప్రక్రియకు సంబంధించి ఉగాది నాటికి ఒక సమగ్ర జాబ్ క్యాలెండర్ విడుదల చేసే యోచనలో మంత్రి నారా లోకేశ్ ఉన్నారని సమాచారం. ఒకేసారి పోలీస్, గ్రూప్ పరీక్షలు, ఇతర శాఖల ఉద్యోగాలకు సంబంధించిన స్పష్టమైన టైమ్‌లైన్‌ను ప్రకటించే అవకాశముందని అంటున్నారు. ఉగాది రోజున ఈ ప్రకటనను గ్రాండ్‌గా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం కూడా జాబ్ క్యాలెండర్ పేరిట ప్రకటనలు చేసినా, అవి పూర్తిస్థాయిలో అమలుకాలేదన్న విమర్శలు ఉన్నాయి. 2023లో ఒకసారి మాత్రమే క్యాలెండర్ ప్రకటించి, ఆ తర్వాత ప్రక్రియ నిలిచిపోయిందని నిరుద్యోగులు




ఆరోపిస్తున్నారు. 2024లో అయితే ఆ అంశం పూర్తిగా తెరమరుగైన పరిస్థితి కనిపించింది. అయితే కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చింది. తాజాగా గ్రూప్?1, గ్రూప్?2 నియామక ప్రక్రియను కూడా ముందుకు తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ఉగాది రోజున రానున్న ప్రకటన నిరుద్యోగ యువతకు పెద్ద ఊరటనిస్తుందన్న అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి ? ఉగాది రోజున మంత్రి నారా లోకేశ్ చేసే ఆ కీలక ప్రకటన ఏ రూపంలో ఉంటుందన్నదానిపైనే ఉంది.

# టీటీడీ ఈవో అనిల్ సింఘాల్ బదిలీ, నెక్స్ట్ ఏంటీ?

తిరుమల, ఫిబ్రవరి 2, (

తిరుమల లడ్డూ కల్తీ అంశలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అనిల్ కుమార్ సింఘాల్‌ను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వులలో ఆదేశించారు. అనిల్ కుమార్ సింఘాల్ 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలోనూ ఆయన టీటీడీ ఈవోగా సుదీర్ఘ కాలం పనిచేశారు. 2017 మే 6 నుండి 2020 అక్టోబర్ 4 వరకు మొదటి విడతలో టీడీపీ, వైసీపీ హయాంలో టీటీడీ ఈవోగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర సర్వీసులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆయనను రెండోసారి టీటీడీ ఈవోగా నియమించడంతో గత ఏడాది సెప్టెంబర్‌లో అనిల్ సింఘాల్ మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో టీటీడీ పాలనలో కొత్త మార్పులు చోటుచేసుకోనున్నాయి. గతంలో ఆయన టీటీడీ ఈవోగా చేయడం, ఆ సమయంలో లడ్డూ కల్తీ ఆరోపణలతో అనిల్ సింఘాల్‌ను బదిలీ చేసి జీఏడీలో రిపోర్ట్ చేయాలని సూచించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీపై ప్రత్యేక విచారణ బృందం ఇటీవల తన తుది నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈ నివేదికతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి నిప్పు రాజుకుంది. సిట్ తన ఛార్జ్ షీట్‌లో తిరుమలకు నెయ్యి సరఫరాలో భారీ అవకతవకలు జరిగినట్లు పేర్కొంది. సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యిని సరఫరా చేయడం ద్వారా రూ. 250 కోట్ల కుంభకోణం జరిగిందని వెల్లడించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలే బాబా డెయిరీతో పాటు ఇతర కంపెనీలు నకిలీ సీల్స్, తప్పుడు ల్యాబ్ రిపోర్టులతో టీటీడీని మోసం చేసినట్లు గుర్తించింది. అయితే, తాజా నివేదికలో జంతువుల కొవ్వు ఆనవాళ్లు లేవని పేర్కొంది. కానీ పామాయిల్, కెమికల్ ఎస్టర్స్ వంటి ఇతర పదార్థాలతో నెయ్యిని కల్తీ చేసినట్లు పేర్కొన్నట్లు వార్తలు రావడంతో




చర్చ మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వం కావాలనే నిబంధనలు సడలించి, తమకు అనుకూలమైన డెయిరీలకు కాంట్రాక్టులు ఇచ్చిందని టీడీపీ విమర్శిస్తోంది. నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందన్న ఎన్డీడీబీ నివేదికను గుర్తు చేస్తూ, సిట్ నివేదిక కల్తీని ధృవీకరించిందని, ఇది ముమ్మాటికీ భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. సిట్ నివేదికలో జంతు కొవ్వు లేదని తేలడంతో వైసీపీ ఎదురుదాడి ప్రారంభించింది. సీఎం చంద్రబాబు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే దేవుడిని వాడుకున్నారని, అబద్ధపు ప్రచారంతో భక్తులను అయోమయానికి గురిచేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. క్లీన్ చిట్ లభించిందని వైసీపీ నేతలు వాదిస్తుంటే, కల్తీ జరిగిందని సిట్ స్పష్టంగా చెప్పిందని టీడీపీ సహా కూటమి నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో, అసలు దోషులు ఎవరో తేల్చి కఠిన శిక్ష వేయాలని భక్తులు కోరుకుంటున్నారు.

# విశాఖలో గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 2

విశాఖపట్నం ఒకప్పుడు ప్రశాంతతకు చిరునామాగా నిలిచేది. సముద్రతీర గాలితో, పచ్చని కొండలతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన ఈ నగరం 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అయితే కాలక్రమేణా అభివృద్ధి వేగం పెరిగిన కొద్దీ, దానికి అనుసంధానంగా కాలుష్యం కూడా విస్తరించింది. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, అదే ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతుండటంపై మేధావులు, పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటన సందర్భంగా కాలుష్య సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కాలుష్య నియంత్రణ విషయంలో ఇక సీరియస్ చర్యలు తప్పవని అధికారులకు ఆయన స్పష్టంగా సూచించారు. చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా, కఠినంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ యంత్రాంగం, పరిశ్రమలు, ప్రజలు అందరూ కలిసి పనిచేస్తేనే కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధి పెరిగినంత వేగంగా కాలుష్యం కూడా పెరిగిపోయిందని పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా




రసాయన పరిశ్రమల వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్న పరిస్థితి ఉందని, పిల్లల్లో చర్మ వ్యాధులు, మహిళల్లో గర్భస్రావాలు, పెద్దల్లో ఊపిరితిత్తుల సంబంధిత రోగాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇది అభివృద్ధి పేరుతో ప్రజల జీవితాలతో చెలగాటమాడటమేనని ఆయన వ్యాఖ్యానించారు. విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల్లో బొగ్గు ధూళి వల్ల కాలుష్యం అధికమవుతోందని, దాని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పరిశ్రమలు రావడాన్ని ప్రభుత్వం వ్యతిరేకించడం లేదని, కానీ అవి నిబంధనలు పాటిస్తూ, కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా పరిశ్రమల్లో తప్పనిసరిగా అమలు చేయాల్సిన 33 శాతం గ్రీన్ బెల్ట్ నిబంధనను కచ్చితంగా పాటించాలన్నారు. పర్యావరణ అధికారులు కూడా మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, జీవ వైవిధ్యాన్ని కాపాడే విధంగా పని చేయాలని పవన్ సూచించారు. ఇదే సందర్భంలో ఆయన 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది కోస్తా జిల్లాల పరిధిలో సుమారు 970 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని అయిదు కిలోమీటర్ల వెడల్పుతో, మూడు బఫర్ జోన్లుగా అభివృద్ధి చేసి, పచ్చని మొక్కల గోడ నిర్మించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. ఈ ప్రణాళికలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ గ్రీన్ వాల్ తీర ప్రాంతాన్ని రక్షించడమే కాకుండా, కాలుష్యానికి దీర్ఘకాలిక పరిష్కారంగా నిలుస్తుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.

# ముద్రగడ దారెటు..

కాకినాడ, ఫిబ్రవరి 2,

కాపు నాయకుడు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం నుంచి ఎంతోమంది రాజకీయంగా ఎదిగినా, రిజర్వేషన్ ఉద్యమం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేతగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే ఆయన రాజకీయ ప్రస్థానం ఎప్పుడూ ఒకే దిశలో సాగలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉద్యమ నాయకుడిగా ప్రజల్లో ఆదరణ పొందినప్పటికీ, కొన్ని సందర్భాల్లో అదే సామాజిక వర్గానికి వ్యతిరేకంగా ఆయన వైఖరి కనిపించిందని రాజకీయ విశ్లేషకులు అంటారు. ఇటీవల జరిగిన 2024 ఎన్నికల్లో ఆయన ఇచ్చిన పిలుపును కాపు వర్గం పెద్దగా పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా జనసేన పార్టీ పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ ఓటమి కోసం ప్రయత్నించినా, ఆ ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఎన్నికల ఫలితాల అనంతరం జగన్మోహన్ రెడ్డిను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పోరాడతానని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే ఆ సమయంలోనే ఆయన అనారోగ్యానికి గురికావడంతో రాజకీయంగా చురుగ్గా ముందుకు సాగలేకపోయారు. ముద్రగడ రాజకీయ జీవితం ప్రారంభ దశలో ఎంపీగా, మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కానీ ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఓడిపోవడం ఆయనను తీవ్రంగా కలచివేసిందని చెబుతారు. ఆ ఓటమి తరువాత తీసుకున్న కొన్ని నిర్ణయాలు రాజకీయంగా సరైనవి కాదన్న అభిప్రాయం ఉంది. ప్రస్తుతం వయసు పెరిగిపోవడం, ఆరోగ్య సమస్యలు ఉండటంతో తన కుమారుడికి రాజకీయ భవిష్యత్తు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారని సమాచారం. ఎన్నికలకు ముందు ఆయన జనసేనలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. గౌరవం ఇస్తే పార్టీలో చేరేందుకు సిద్ధమని ఆయన సంకేతాలు పంపినట్టు



అప్పట్లో వార్తలు వచ్చాయి. మొదట పవన్ సానుకూలంగా స్పందించినా, ఆ తర్వాత పరిస్థితులు మారడంతో ముద్రగడ మనస్తాపానికి గురయ్యారని అంటారు. అదే సమయంలో ఆయన తాడేపల్లి వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ ఆయనకు గౌరవం లభించినప్పటికీ, పార్టీ భవిష్యత్తుపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో పవన్ ప్రభావం కొనసాగుతుండటం, వైసీపీ బలహీనంగా కనిపించడంతో 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి అవకాశాలు తక్కువేనన్న చర్చ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముద్రగడ ఆలోచన మారుతున్నట్టు రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇటీవల టీడీపీకి చెందిన సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప తో ఆయన భేటీ కావడం మరింత ఆసక్తిని రేపింది. ఈ భేటీ మర్యాదపూర్వకమేనని చెప్పినా, దీని వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుమారుడి రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా ముద్రగడ కూటమి పార్టీల వైపు చూస్తున్నారన్న ప్రచారం బలపడుతోంది. గతంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎదురైన నష్టాన్ని సరిదిద్దుకునే ప్రయత్నంగా దీనిని కొందరు భావిస్తున్నారు. అయితే ఈ ప్రచారంలో నిజం ఎంతుందో, ఆయన తదుపరి అడుగు ఏమిటో కాలమే నిర్ణయించాల్సి ఉంది.

# క్లీన్ చిట్టా... పాప పరిహారం

తిరుమల, ఫిబ్రవరి 2, (

తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ చిచ్చు రేపింది. సీబీఐ పర్యవేక్షణలోని సిట్ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను ఇరు పక్షాలు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తుండటంతో, అసలు నిజం ఏంటనేది ఇప్పుడు సామాన్య భక్తులలో సరికొత్త చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా వైసీపీ చేస్తున్న క్లీన్ చిట్ ప్రచారానికి, సిట్ ఛార్జిషీట్‌లో ఉన్న కెమికల్ నెయ్యి వాస్తవాలకు మధ్య రాజకీయ ప్రచారం తెరలా మారిపోతోంది. సిట్ నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు లేదా చేప నూనె ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని వైసీపీ గట్టిగా ప్రచారం చేస్తోంది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే ఈ అపవాదు వేసిందని, ఇప్పుడు సిట్ నివేదికతో తాము సుద్ధపూసలమని నిరూపితమైందని ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు. ప్రజల మనోభావాలతో ఆడుకున్నందుకు కూటమి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం జంతు కొవ్వు అంశాన్ని మాత్రమే హైలైట్ చేస్తూ, ఇతర అంశాలను పక్కదారి పట్టించే వ్యూహాన్ని వైసీపీ అనుసరిస్తోంది.అయితే, సిట్ ఛార్జిషీట్ లోని లోతైన అంశాలను గమనిస్తే భయంకరమైన వాస్తవాలు బయటపడుతున్నాయి. సిట్ నివేదిక ప్రకారం.. సరఫరా అయిన నెయ్యిలో జంతు కొవ్వు లేకపోవచ్చు కానీ, అది అసలు నెయ్యే కాదు. అది కేవలం ప్రమాదకరమైన కెమికల్స్ , వెజిటబుల్ ఆయిల్స్ తో తయారైన మిశ్రమమని సిట్ తేల్చింది. అంటే, ఐదేళ్ల పాటు లక్షల లీటర్ల కెమికల్ నెయ్యి ని భక్తులకు ప్రసాదం రూపంలో పంచారనేది సిట్ ప్రధాన అభియోగం. జంతు కొవ్వు లేదని సంబరపడుతున్న వైసీపీ, ఈ కెమికల్ కల్తీ పై ఎందుకు మాట్లాడటం లేదని టీడీపీ ప్రశఅనిస్తోంది.వైసీపీ ఇంతలా ఎదురుదాడి చేస్తున్నా, కూటమి ప్రభుత్వం నుండి ఇంకా గట్టి కౌంటర్ మొదలవ్వలేదు. దీనికి ప్రధాన కారణం, సిట్ నివేదికపై కోర్టుల స్పందన కోసం ప్రభుత్వం వేచి చూస్తుండటమే కావచ్చు. సీబీఐ నేతృత్వంలోని సిట్ ఇచ్చిన ఈ ఛార్జిషీట్ కోర్టులో విచారణకు



వచ్చినప్పుడు, వైసీపీ చేసిన తప్పులు నిబంధనల ఉల్లంఘన, అనర్హులైన వారికి టెండర్లు ఎలా నిరూపితమవుతాయనే దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజకీయం కంటే న్యాయపరంగా వైసీపీని ఇరికించాలని కూటమి భావిస్తున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఈ సీబీఐ-సిట్ రిపోర్టుపై న్యాయస్థానాలు స్పందించనున్నాయి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన బోలే బాబా డైరీ ,ఇతర సంస్థల వెనుక ఉన్న పెద్ద తలకాయల పాత్రపై కోర్టు ప్రశ్నలు కురిపించే అవకాశం ఉంది. జంతు కొవ్వు లేదన్న ఒక్క పాయింట్ మీద వైసీపీ గెలిచినట్లు కనిపిస్తున్నా, విషపూరితమైన కెమికల్ నెయ్యి సరఫరా జరిగిందని కోర్టు గనుక సీరియస్ అయితే, ఆ పార్టీకి అది కోలుకోలేని దెబ్బ అవుతుంది.సామాన్య భక్తుడికి కావలసింది జంతు కొవ్వు ఉందా లేక కెమికల్స్ ఉన్నాయా అన్నది కాదు.. తమ ఆరాధ్య దైవం ప్రసాదంలో కల్తీ జరిగిందా లేదా అన్నదే ముఖ్యం. సిట్ నివేదిక కల్తీ జరిగిందని స్పష్టంగా చెబుతోంది. ఒకవేళ కేవలం కెమికల్స్ మాత్రమే ఉన్నా, అది కూడా అపచారమే అన్నది భక్తుల విశ్వాసం. కాబట్టి వైసీపీ చేస్తున్న క్లీన్ చిట్ ప్రచారం కేవలం రాజకీయ రంగు పూయడమేనని, కోర్టుల తీర్పు తర్వాత అసలు దోషులు ఎవరో బహిర్గతమవుతాయని టీడీపీ నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

### సిట్ రాడార్‌లో ముగ్గురు

కల్తీ నెయ్యి కేసులో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం ప్రభుత్వానికి సిట్ 14 పేజీల లేఖ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ లేఖలోని చివరి పేరాలో ఉన్న అంశాలు కీలకంగా మారాయి. తిరుమలలో నెయ్యి సరఫరాకు సంబంధించిన అప్పట్లో కీలక బాధ్యతల్లో ఉన్న ముగ్గురు ఉన్నతాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిట్ స్పష్టంగా చెప్పినట్టు తెలుస్తోంది. ఇందులో అప్పటి , నేటి ఈవో అనిల్ సింఘాల్, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఫైనాన్సియల్ అడ్వైజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ బాలాజిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పింది. ఈ సిఫార్సుల మేరకు ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కొన్ని గంటల్లోనే వచ్చే అవకాశం ఉంది. సిట్ తన నివేదికలో అధికారుల తీరుపై తీవ్రమైన విమర్శలు గుప్పించిందని అంటున్నారు. శ్రీవారి ప్రసాదానికి వాడే నెయ్యి సరఫరాలో ఉండాల్సిన కఠినమైన నాణ్యతా ప్రమాణాలను బలహీన పరిచేలా ఈ అధికారులు వ్యవహరించారని సిట్ గుర్తించిందట. ముఖ్యంగా నెయ్యి సేకరణకు సంబంధించిన నిబంధనల తయారీలో కనీసం మనసు పెట్టలేదని ఆరోపించిందని సమాచారం. అత్యంత నిర్లక్ష్యంగా పని చేశారని నివేదికలో పేర్కొందని తెలుస్తోంది. ఈ పద్ధతుల వల్ల నెయ్యి నాణ్యతలో పెద్ద ఎత్తున రాజీ జరిగిందనే ఆరోపణ చేరిందంటున్నారు. ఒకప్పుడు తిరుమల నెయ్యి టెండర్లు అంటే అత్యంత కఠినమైన నిబంధనలకు మారుపేరుగా ఉండేదని, కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిబంధనల స్వరూపం మారిపోయిందని నివేదికలో వెల్లడించినట్టు సమాచారం. యథేచ్ఛగా నిబంధనలు సడలించడంతో కల్తీకి ఆస్కారం ఏర్పడిందని అంటున్నారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు స్వయంగా పాలు సేకరించాల్సిన అవసరం లేదని రూల్ తీసుకొచ్చారు. వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేకుండా టెండర్లు అనుతిచ్చారు. కనీసం మూడేళ్ల పాటు కార్యకలాపాలు నిర్వహించాలనే రూల్ పక్కన పెట్టారు. టెండర్ దక్కించుకోవడానికి ఉండాల్సిన కనీస టర్నోవర్ మొత్తాన్ని 250 కోట్ల నుంచి 150 కోట్లకు తగ్గించేశారు. ఇలాంటి సడలింపుల ద్వారానే నెయ్యి కల్తీకి ఆస్కారం ఏర్పడిందని సిట్ వెల్లడించినట్టు వార్తలు వస్తున్నాయి. ఓవైపు దీనిపై రాజకీయ దుమారం రేగుతున్న టైంలోనే సిట్ సిఫార్సుల మేరకు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సిట్ నివేదిక అందుకున్న సుప్రీంకోర్టు ఇంకా ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో అన్న సస్పెన్స్ కూడా కొనసాగుతోంది.

====================

# అరవ శ్రీధర్‌కు నిద్ర లేని రాత్రులు..

కడప, ఫిబ్రవరి 2,

జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయంలో బాధితులు ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది. రోజుకొక వీడియోతో ఆయనకు నిద్ర లేకుండా చేస్తోంది. ఓవైపు అధికారికంగా విచారణ సాగుతున్న టైంలోనే ఇలా ఒక్కో వీడియోతో సంచలనం రేపుతోంది. ఆమె డీఫ్‌ఫేక్ వీడియోలతో అసత్య ఆరోపణలు చేస్తుందని ఎమ్మెల్యే వర్గం కవర్ చేస్తుంటే ఆమె మాత్రం తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెబుతోంది. అందుకు తగ్గట్టుగానే వీడియోలు రిలీజ్ చేస్తోంది. తాజాగా అసెంబ్లీ నుంచి బాధితురాలికి వీడియో కాల్ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీడియో వదిలారు బాధితురాలు. తాజాగా బయటపడిన వీడియో వివరాల ప్రకారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే అరవ శ్రీధర్ బాధితురాలితో వీడియో చాటింగ్ చేస్తున్నట్టు ఉంది. సభలో ప్రజా సమస్యలు లేవన్నట్టు అసెంబ్లీ ప్రాంగణం నుంచే మహిళకు వీడియో కాల్ చేసి అసభ్యకరమైన రీతిలో మాట్లాడటంపై వైసీపీతోపాటు నార్మల్ నెటిజన్లు ఆన్‌లైన్‌లో విమర్శలు చేస్తున్నారు. అసెంబ్లీ గౌరవ మర్యాదలు కాలరాస్తున్నారని మండిపడుతున్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా ఉన్న అరవ శ్రీధర్ తనను రేప్ చేసి ఐదు సార్లు అబార్షన్ అయ్యేలా చేశారని బాధితురాలు నాలుగు రోజుల క్రితం మీడియా ముందుకు వచ్చారు. తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని తనను వేధింపులకు దిగారని ఆరోపించారు. దీనిపై పార్టీ పెద్దలకు, ప్రభుత్వ పెద్దలకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని అందుకే మీడియా ముందుకు రావాల్సి వచ్చిందన్నారు. మీడియాతో మాట్లాడిన ఆమె తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. తాను డబ్బుల కోసమే, లేకుండా ఎమ్మెల్యేను పెళ్లి చేసుకోవాలని ఉద్దేశంతో ఇదంతా చేయలేదని, తనకు న్యాయం జరగాలని ఆయనకు శిక్ష పడాలని డిమాండ్ చేశారు. తాను పాతిక కోట్లు డిమాండ్ చేసిందని అబద్దమని చెప్పారు. తన వెనుక వైసీపీ ఉందనే ప్రచారాన్ని కూడా బాధితురాలు ఖండించారు. ఈ ఆరోపణలు వచ్చినప్పటి నుంచి శ్రీధర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన తప్పు లేదని తనను బ్లాక్ మెయిల్ చేయడానికి సదరు మహిళ డీప్‌ఫేక్ వీడియోలతో పరువు తీస్తున్నారని ఆరోపించారు. కచ్చితంగా మహిళ అసలు రూపం తెలుస్తుందని అన్నారు. ఇంతలో జనసేన పార్టీ కూడా ఈ వివాదంపై స్పందించి విచారణకు కమిటీ వేసింది. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. విచారణ పూర్తి అయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేకు సూచించారు. అయితే ఈ వివాదం మొదలైనప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటమే కాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది



### రంగంలోకి హ్యూమన్ రైట్స్ కమిషన్


వివాదం దుమారం రేపడంతో జనసేన పార్టీ అంతర్గత విచారణకు ఆదేశించింది. పార్టీ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని సమాచారం. ఇప్పటివరకు బయటకు వచ్చిన వీడియోలు, అందులో కనిపిస్తున్న అంశాలు, వాటి నిజానిజాలపై కమిటీ సమగ్రంగా పరిశీలన జరుపుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు ఆరోపణలు చేసిన వీణను కూడా కమిటీ ప్రత్యక్షంగా కలసి వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరి తొలి వారంలో జనసేన అంతర్గత విచారణ కమిటీ రైల్వే కోడూరు ప్రాంతంలో పర్యటించనుందని సమాచారం. అక్కడ స్థానిక స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి ఒక నివేదిక సిద్ధం చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ నివేదిక ఆధారంగా పార్టీ క్రమశిక్షణ చర్యలు ఏవైనా ఉంటే తీసుకుంటామని స్పష్టంగా తెలియజేశారు. ఈ అంశంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే సమాచారం సేకరించారని, పూర్తి నివేదిక వచ్చిన తర్వాతే తదుపరి నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారం మరో కీలక దశకు చేరింది. వీణ తాజాగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ను ఆశ్రయించారు. తనపై లైంగిక దాడి జరిగిందని, పెళ్లి హామీతో మోసం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదును ఆమె తరఫున న్యాయవాది ఆజాద్ దాఖలు చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ ఫిర్యాదును స్వీకరించి విచారణకు అంగీకరించడంతో ఈ కేసు జాతీయ స్థాయిలోనూ దృష్టిని ఆకర్షిస్తోంది.అదే సమయంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ కూడా స్పందించారు. ఆమె వీణతో ఫోన్‌లో మాట్లాడి ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలిపారు. ఈ ఘటనలో నిజాలు వెలికి తీసి బాధితురాలికి న్యాయం చేయడానికి కమిషన్ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ పరిణామాలన్నింటితో ఈ వ్యవహారం కేవలం రాజకీయ అంశంగా కాకుండా, చట్టపరమైన,మానవ హక్కుల కోణంలోనూ కీలకంగా మారింది. అంతర్గత పార్టీ విచారణ, జాతీయ మానవ హక్కుల కమిషన్ చర్యలు, మహిళా కమిషన్ స్పందన నేపథ్యంలో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

====================

# కొబ్బరికాయ కొట్టే సంప్రదాయం వెనుక ఆంతర్యం ఏమిటి -ఎప్పుడు, ఎలా ప్రారంభమైంది

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ఇంట్లో పూజ చేసినా, గుడికి వెళ్లినా కొబ్బరికాయ కొట్టడం ఆచారం. చాలామంది ఈ సంప్రదాయం పాటిస్తారు. అసలు కొబ్బరికాయ హిందువులకు మాత్రమే ఎందుకు ప్రత్యేకం..? కొబ్బరికాయను ఎందుకు పగులగొడతారు.కొబ్బరికాయ సంస్కృతంలో దేవుడికి ప్రతిరూపం. కొబ్బరికాయను శ్రీఫలం అని కూడా పిలుస్తారు. శ్రీఫలం అంటే.. దేవుడి ఫలం అని అర్థం..హిందూ సంప్రదాయంలో కొబ్బరికాయను మనిషి తలకు ప్రతీకగా భావిస్తారు. కొబ్బరికాయపైన ఉండే పీచు మనిషి జుట్టు, గుండ్రటి ఆకారం మనిషి ముఖం, కొబ్బరికాయలోపల ఉండే నీళు రక్తం, గుజ్జు లేదా కొబ్బరి మనసుని సూచిస్తాయికొబ్బరికాయ వెనక భాగంలో ఉండే మూడు కన్నులకు చాలా మంచి అర్థం ఉంది. ముక్కంటిగా పిలువబడే.. శివుడి మూడు కన్నులను ఆ మూడు గుర్తులు సూచిస్తాయి పూర్వకాలంలో చాలా మంది, చాలా సందర్భాల్లో నరబలి ఇచ్చేవాళ్లు. అంటే దేవుడికి మనుషులను బలిగా ఇచ్చేవాళ్లు. ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పడానికే ఆధ్యాత్మిక గురు ఆది శంకర నరబలికి బదులుగా కొబ్బరికాయను దేవుడికి సమర్పించండని ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారు.కొబ్బరికాయ పగలగొట్టడం వెనక అంతరార్థం ఉంది. ఇలా టెంకాయను పగులకొడితే.. మనుషుల అహం, తొలగిపోతుందని, అలాగే చాలా స్వచ్ఛంగా ఉండాలని సూచిస్తుంది. దాంతోపాటు తమ కోరికలు తీర్చిన దేవుడికి మొక్కుగా కొబ్బరికాయను సమర్పిస్తారు భక్తులు.



# ఏఐ సిటీగా అమరావతి

విజయవాడ, ఫిబ్రవరి 2

రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా మాత్రమే కాకుండా జ్ఞానం, సాంకేతికతకు కేంద్రబిందువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ఆలోచన వెనుక రాష్ట్ర యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించి, అధిక వేతన ఉద్యోగాలు సృష్టించాలనే దృఢ సంకల్పం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిని భవిష్యత్ నగరంగా అభివృద్ధి చేయాలనే దృష్టితో ఇప్పటికే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగా రాజధాని పరిధిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో క్వాంటం కంప్యూటింగ్ సౌకర్యాలు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీనికి అనుబంధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్వవిద్యాలయాన్ని వచ్చే నెల 19న ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.అమరావతి పేరు వినగానే సాంకేతికత గుర్తుకొచ్చేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్న ఆలోచనతో సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని అధికారులు చెబుతున్నారు. నగర నిర్మాణం నుంచి గుర్తింపు వరకు ప్రతీ అంశంలో టెక్నాలజీ కనిపించాలనే ఉద్దేశంతో అమరావతిని "ఏఐ సిటీ"గా నిలబెట్టాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారు. ఈ దిశగా అమరావతి పేరుతోనే ఏఐ భావన ప్రతిబింబించేలా ప్రత్యేక లోగో రూపకల్పన చేయాలన్న ఆలోచన కూడా తీసుకొచ్చారు.ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్విడియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో వచ్చే రెండేళ్లలో రాష్ట్రానికి చెందిన దాదాపు పది వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో శిక్షణ అందించనున్నారు. అంతేకాకుండా అమరావతిలో స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించేలా అవసరమైన మద్దతు కూడా ఈ విశ్వవిద్యాలయం ద్వారా లభించనుందని చెబుతున్నారు.ప్రపంచవ్యాప్తంగా ఏఐ విప్లవం వేగంగా విస్తరిస్తోంది. అమెరికా తర్వాత ఎక్కువ సంఖ్యలో ఏఐ నైపుణ్యం కలిగిన యువత భారత్‌లోనే ఉన్నారని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకుని, రాష్ట్రాన్ని కేవలం సేవలు అందించే స్థాయిలో కాకుండా, సాంకేతికతను సృష్టించే స్థాయికి తీసుకెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. గతంలో హైదరాబాద్ ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసిన అనుభవం ఉన్న చంద్రబాబు, ఇప్పుడు అమరావతిని గ్లోబల్ డిజిటల్ రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏఐ చుట్టూనే తిరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో, ప్రతి కుటుంబం నుంచి ఒక ఏఐ నిపుణుడు తయారవ్వాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రచిస్తున్నారని చెబుతున్నారు. ఈ ప్రయత్నాల ద్వారా మధ్యతరగతి ఆదాయాలు పెరగడమే కాకుండా, రాష్ట్రం భవిష్యత్ తరాలకు బలమైన సాంకేతిక పునాది వేయనుందని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

# కింగ్ మేకర్ గా విజయ్...

చెన్నై, ఫిబ్రవరి2, (



తమిళనాడులో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ కూడా తమిళనాడులో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాయి. ఈమేరకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఇక ఈసారి ఎన్నికల్లో సినీ స్టార్ విజయ్ పార్టీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే చివరి సినిమా విడుదల విషయంలో ఇబ్బందులు పడుతుండగా, తాజాగా వచ్చిన సర్వే ఫలితాలు విజయ్ పార్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. ఇండియా టుడే, సీ ఓటర్ సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి.తాజా సర్వేలో ఇండీ+ కూటమి 45% ఓటర్ల మద్దతు సాధించగా, ఎన్డీఏకు 33% లభించింది. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన టీవీకే 15% ఓటర్లను ఆకర్షించింది. మిగిలిన 7% ఇతర పార్టీలకు విభజించబడింది. ఈ శాతం టీవీకేను గణనీయ శక్తిగా నిలబెట్టింది.విజయ్ మాస్ అప్పీల్, క్లీన్ ఇమేజ్ వల్ల పార్టీ పాపులారిటీ పెరిగింది. పట్టణ, యువత ప్రాంతాల్లో టీవీకే బలం కనిపిస్తోంది. ఇది సంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా యువత ఎంపిక చేసుకుంటున్నట్టు సూచిస్తోందితాజా సర్వే ఫలితాలు టీవీకే క్యాడర్‌కు ఎనర్జీ ఇస్తాయి. ప్రస్తుత ట్రెండ్ కొనసాగితే, కూటములు, ప్రభుత్వ ఏర్పాటులో టీవీకే కీలక పాత్ర పోషిస్తుంది. రాజకీయ విశ్లేషకులు టీవీకేను అతీతంగా చూస్తున్నారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఆకాంక్షకు టీవీకే సిద్ధమవుతోంది.

================

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

## -విద్యుత్ శాఖ అభివృద్ధిలో మరో కీలక ఘట్టం -ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయ నూతనభవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



మణుగూరు, ఫిబ్రవరి 02 (భారతశక్తి): ప్రజా పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుట్ట మల్లారం గ్రామ పంచాయితీ పరిధిలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం ప్రారంభం కావడం ద్వారా మణుగూరు మండలం తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్యల పరిష్కారం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, పరిపాలనా పనులు ఇకపై స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని, మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ నూతన ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు, విద్యుత్ శాఖ సిబ్బందికి కూడా సౌకర్యవంతమైన పని వాతావరణం ఏర్పడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేందర్, డీఈ జీవన్ కుమార్, ఎస్ఏఓ శ్రీధర్, ఏడీఈ ఉమా మహేశ్వర్ రావు, ఏఏఓ సత్యనారాయణ, మండల,పట్టణ అధ్యక్షులు పిరినాకి నవీన్, శివ సైదులు, కూచిపూడి బాబు, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, 14 టైర్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, బొగ్గు ముఠా అధ్యక్షులు రాంబాబు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవ రావు, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, కట్టు మల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, లంక మల్లారం సర్పంచ్ పూనెం రమేష్, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, విప్పల సింగారం ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యులు, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌంటింగ్..ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 02 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, పటిష్ట భద్రత మధ్య నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.


సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ చేపట్టిన భద్రతా చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లెక్కింపునకు అవసరమైన సిబ్బందిని ముందుగానే కేటాయించాలని, గదుల్లో సరిపడా టేబుళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సీటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, భోజన వసతి పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, తహసిల్దార్ రాజు తదితరులు ఉన్నారు.

# పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

## -సమస్యలతో స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలి.

## -పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి జిల్లా బ్యూరో,ఫిబ్రవరి 02 (భారతశక్తి): పోలీస్ స్టేషన్ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. సోమవారం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా 5ఎ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను ఒక క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్టికల్స్ వారీగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డయల్ 100 ఫోన్ రాగానే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రమాద నివారణా చర్యలు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అక్కడ విధులలో ఉన్న సిబ్బంది సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్, ఎస్సై శ్రీనివాస్, టీజీఎస్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జహీరాబాద్ నారాయణఖేడ్ మున్సిపాలిటీల అభ్యర్థులకు బి ఫారాలు అందజేత

## – అభ్యర్థులకు ఒకరోజు ముందుగానే బి ఫారాలు పంపిణీ చేసిన డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 2:

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులకు క్షేత్రస్థాయిలో లైన్ క్లియర్ చేసింది. సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మంగళవారం నామినేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో, అభ్యర్థులకు రెండు రోజుల ముందే బి–ఫారాలను అందజేసి ఎన్నికల బరిలోకి దింపారు. జహీరాబాద్ నారాయణఖేడ్ మున్సిపాలిటీలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులకు జిల్లా డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మంగళవారం బి ఫారాలు అందజేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రి అజారుద్దీన్ సమక్షంలో నిర్మల జగ్గారెడ్డి నారాయణఖే జహీరాబాద్ మున్సిపాలిటీల బీఫారాలు అందజేశారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీకి సంబంధించిన బి పారాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ డిసిసి అధ్యక్షురాలు స్వయంగా అందజేశారు. అభ్యర్థులు తమ బిఫారాలు సమర్పించేందుకు మంగళవారం చివరి రోజు కావడంతో ఒకరోజు ముందుగానే బి ఫారాలు అందించి ఎన్నికల రంగంలోకి దింపారు. ఇక జహీరాబాద్ అభ్యర్థులకు బీఫారాలను నియోజకవర్గ ఇన్చార్జి చంద్రశేఖర్ సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి ఇలా సమక్షంలో నిర్మల జగ్గారెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఇన్చార్జులు అభ్యర్థులు పాల్గొన్నారు.


# భూపాలపల్లి మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరాలి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూపాలపల్లి జిల్లా ( భారత శక్తి) ఫిబ్రవరి 2:

భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో సీపీఐ, సీపీఐ(యం)పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని భూపాలపల్లి మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 18, 19, 30 వార్డులు ఎల్బీ నగర్, రెడ్డి కాలనీ, బానోత్ వీధి, సత్తార్ నగర్ కాలనీలల్లో సీపీఐ , సీపీఐ(యం)పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కొరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, సీపీఐ(యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ముఖ్య నాయకులు మరియు ఆయా వార్డుల ఎన్నికల ఇంచార్జీ లతో కలిసి ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులల్లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూపాలపల్లి మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరాలని, అందుకు కాంగ్రెస్ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయుధాలుగా చేసుకుని ప్రతి ఇంటి గడపను తట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తోందని తెలిపారు. భూపాలపల్లి పట్టణ అభివృద్ధికి ఇప్పటికే చేపట్టిన పలు కార్యక్రమాలను కొనసాగిస్తూ, మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు అత్యంత అవసరమని అన్నారు. ప్రజలకు మెరుగైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం, పేదల సంక్షేమం వంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేసినట్లయితే భూపాలపల్లి మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన పదేళ్లు పాలించిన వాళ్లకు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీలకు సరైన నిధులు కేటాయించకపోవడం, అభివృద్ధి పనులను పూర్తిగా విస్మరించడం జరిగిందన్నారు. ఎన్నికలు వస్తే హామీలు ఇవ్వడం, తర్వాత వాటిని గాలికి వదిలేయడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని పార్టీకి ఇప్పుడు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి, మున్సిపాలిటీలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు బీఆర్ఎస్ మోసపూరిత రాజకీయాలను గుర్తించి, అభివృద్ధి మరియు సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

# ఆర్జీయూకేటీ బాసరలో ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం బి.ఎఫ్.ఎస్.ఐ. మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్ ప్రారంభం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 02 (భారత శక్తి):రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ), బాసరలో ప్రస్తుత ద్వితీయ సంవత్సర బి.టెక్ విద్యార్థుల కోసం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రారంభించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన అడుగు. ఈ విద్యా సంవత్సరం మొదటి విడతలో మొత్తం 156 మంది విద్యార్థులు ఈ ప్రోగ్రామ్ కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో బి.ఎఫ్.ఎస్.ఐ. రంగం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ మైనర్ డిగ్రీ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులు తమ కోర్ సబ్జెక్టులతో పాటు ఆర్థిక, విశ్లేషణాత్మక, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ కెరీరును మెరుగుపరుచుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.యూనివర్సిటీ ఓ.ఎస్.డి.,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఇ. మురళీ దర్శన్ మాట్లాడుతూ, జాతీయ నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా, ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టుగా ఇన్నోవేటివ్ అకడమిక్ కార్యక్రమాలను ప్రవేశపెట్టేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్ రూపకల్పనలో సహకరించిన బి.ఎఫ్.ఎస్.ఐ. సంస్థను, యూనివర్సిటీ సభ్యులను ఆయన అభినందించారు.బి.ఎఫ్.ఎస్.ఐ. కన్సార్టియం నుండి విచ్చేసిన ప్రతినిధి విద్యార్థులకు ఓరియంటేషన్ ఇచ్చారు. ప్రోగ్రామ్ నిర్మాణం, నేర్చుకోబోయే అంశాలు, అసెస్‌మెంట్ ప్రక్రియ మరియు బి.ఎఫ్.ఎస్.ఐ. రంగంలో ఉండే ఉపాధి అవకాశాల గురించి మాధురి వివరించారు. కన్సార్టియం తరపున సునీత, శిరీష ఈ కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారు.

ఆర్జీయూకేటీ బాసరలో ఈ మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ కె. మహేశ్ (అసోసియేట్ డీన్ ఇంజనీరింగ్) పాఠ్యప్రణాళిక, క్రెడిట్ నిర్మాణం మరియు అమలు ప్రణాళికను వివరించారు.ఈ ప్రారంభోత్సవ వేడుకలో అసోసియేట్ డీన్ (అకడమిక్స్ అండ్ ప్లానింగ్) శేఖర్ శీలం, అసోసియేట్ డీన్ (సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్) డాక్టర్ ఎస్. విఠల్, డా.స్వాతి, జి.స్వప్నిల్, చరణ్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో వృత్తిపరమైన సంసిద్ధతను మరియు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఆర్జీయూకేటీ బాసర చేస్తున్న నిరంతర కృషికి ఈ బి.ఎఫ్.ఎస్.ఐ. మైనర్ డిగ్రీ లాంచ్ ఒక నిదర్శనం.

# పీజీ హాస్టల్‌లో ల్యాప్‌టాప్ చోరీల గుట్టురట్టు



దుండిగల్, ఫిబ్రవరి 02(భారత శక్తి): దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లి ప్రాంతంలో పీజీ హాస్టళ్లను లక్ష్యంగా చేసుకుని జరిగిన వరుస ల్యాప్‌టాప్ దొంగతనాల కేసును ఛేదించినట్లు దుండిగల్ ఇన్స్పెక్టర్ సతీష్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, మొత్తం ఏడు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.వివరాల్లోకి వెళ్తే బహదూర్‌పల్లి లోని ఓ పీజీ హాస్టల్‌లో జనవరి 24వ తేదీ తెల్లవారుజామున చోరీ జరగగా, రెండు ల్యాప్‌టాప్‌లు అపహరణకు గురయ్యాయి. అదే ప్రాంతంలో జనవరి 26వ తేదీ తెల్లవారుజామున మరోసారి పీజీ హాస్టల్‌లోని వివిధ గదుల నుంచి మొత్తం ఏడు ల్యాప్‌టాప్‌లు దొంగిలించబడ్డాయి. ఈ ఘటనలపై దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.దర్యాప్తులో భాగంగా, దుండిగల్ పోలీస్ స్టేషన్ క్రైం టీం ఈ రోజు సాయంత్రం 7 గంటల సమయంలో బహదూర్‌పల్లి ఎక్స్‌రోడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడే చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, రిసీవర్ వద్ద నుంచి ఐదు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గంగనమోని అన్వేష్ కుమార్ (20)ను, రిసీవర్‌గా మయూర్ అశోల్ మేవాడా (46)ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌ల మొత్తం విలువ సుమారు ?.3.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

# ఆదిలాబాద్ జిల్లాను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

**-ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ పై ఎంపీ గేడం నగేష్ కి చిత్తశుద్ధి లేదు**
**-నలుగురు ఎమ్మెల్యేలను ఆదిలాబాద్ ఇచ్చిన ఒక యూనివర్సిటీ ఇవ్వలేకపోయారు**
**-సీసీఐ పునరుద్ధరణ, హైదరాబాద్ నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ఉసేత్తని కేంద్ర బడ్జెట్**
**-మాటల్లో తప్ప చేతల్లో కానరాని ఆదిలాబాద్ విమానాశ్రయం**
**-కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**


ఆదిలాబాద్ జిల్లా,ఫిబ్రవరి 02 (భారత శక్తి )



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆదిలాబాద్ జిల్లాకు న్యాయంగా రావలసిన విమానాశ్రయం, యూనివర్సిటీ, ఆర్మూర్ ఆదిలాబాద్ రైల్వే లైన్, హైదరాబాద్ నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ నిధులు, వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే నిధులు, సీసీఐ పునరుద్ధరణ సంబంధించి ఏ అంశాలు చర్చకు రాకపోవడం బాధాకరమని, ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లా ఎంపీ ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు. ఈ సందర్భంగా బోథ్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గొర్రె తోక బెత్తెడు అన్న చందంగా స్థానిక ఎంపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు మాటలు తప్ప చేతల్లో అభివృద్ధిని చూపెట్టలేరని దానికి నిదర్శనమే ఈ కేంద్ర బడ్జెట్ అని పేర్కొన్నారు. అదిలాబాద్ జిల్లాకే కాకుండా తెలంగాణకు కూడా తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోలేదని, కేవలం ఓట్ల రాజకీయాల కోసమే దక్షిణ భారతదేశాన్ని వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గ్రామీణ భారతానికి ఉ తమిచ్చే వ్యవసాయ రంగానికి, ఉపాధికి నిధులు తగ్గించారని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు లేవని, పర్వతప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం ప్రత్యేక రోడ్ల ప్యాకేజీ ఇవ్వవలసి ఉన్న ఇవ్వలేదని, వ్యవసాయానికి సంబంధించిన ఎరువుల ముడి సరుకుల రేట్లు పెంచుతూ తీసుకున్న నిర్ణయం రైతాంగాన్ని కుంగదిస్తుందని, పేదవారి ఆత్మగౌరవానికి సంబంధించిన ఇంటి నిర్మాణంలో కూడా నిధులు పెంచకుండా కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి 72వేల రూపాయలు మాత్రమే ఇవ్వడం బిజెపి సంకుచిత బుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కిసాన్ సమ్మన్ నిధులు ఆరువేల రూపాయలు నుంచి పదివేల రూపాయలు పెంచుతామని ఒక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చి బడ్జెట్లో పెంచకపోవడం హాస్యాస్పదం అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ఎంపీలు ఎమ్మెల్యేలు ఈ విషయంపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, మాజీ ఎంపిటిసి చట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, ఆత్మా డైరెక్టర్ రహీముద్దీన్, ధన్నూర్ ఉప సర్పంచ్ కారం రవి, చమేందర్ రెడ్డి, మహమ్మద్, ఆత్రం సుశీల, ఆత్మా డైరెక్టర్ గడ్డల నారాయణ, అనిల్ అప్ప, మెరుగు నరసింహ దాసు మాజీ సర్పంచ్, ఇట్టేడి రాజు రెడ్డి, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 02:



ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు లతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు,తదితర అంశాలతో పాటు పంచాయతీరాజ్ ఇంజనిరింగ్, విద్యుత్, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, డి డబ్ల్యు ఓ, డి సి ఎస్ ఓ, పశుసంవర్ధక, శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి లో 16 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్జి దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు,వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, ప్రజలు, పాల్గొన్నారు .

# ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజావాణి

**- పిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ**
**- సమస్యల పరిష్కారానికి ఎస్.హెచ్.ఓలకు ఫోన్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు**
**- అదనపు ఎస్పీ రఘునందన్ రావ్**





సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 2:

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ రఘునందన్ రావ్ తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలతో జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ఫిర్యాదులకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఎస్. హెచ్. ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకుని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలకు పరిష్కారం లభించని సందర్భాల్లో ఎలాంటి భయాలు లేదా ఒత్తిళ్లకు లోనుకాకుండా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# గీతంలో త్యాగరాజ ఆరాధన

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 2 :



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్- లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాజ ఆరాధన -- 2026 వేడుకలను సంగీత కార్యక్రమాల ద్వారా ఘనంగా నిర్వహించి, ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కర్ణాటక సంగీతాన్ని ఓపెన్ ఎలక్టివ్ గా, మైనర్ ప్రోగ్రామ్ గా ఎంపిక చేసుకున్న విద్యార్థులు త్యాగరాజ కీర్తనలను హృద్యంగా ఆలపించారు. వారికి వయోలిన్ పై మహావాది వాసు, మృదంగంపై ఎం. చంద్రకాంత్ సహకారం అందించగా, వారి సహకారం ప్రదర్శన ఆధ్యాత్మిక లోతును, సంగీతంపై శ్రద్ధను పెంచాయి. తొలుత ఈ ప్రదర్శన ఆనందు మురళి, మృదు రవళిల 'ఎందరో మహానుభావులు..'తో ఆరంభమై, ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఆ తరువాత మృదు రవళి ఒంటరిగా 'నమో నమో రాఘవ', 'మనవ్యాలకించర..', 'బాల కనక మయా..', ఆ తరువాత చారుకేశి రాగం, అంతకు మించి ఆలాపన, తాళం, పల్లవిల మేళవిందు, వాద్య సహకార జుగల్ బందీతో అలరించారు. 'ఆడమోదిగలడే..', 'హరిదాసులు వెడలె ముచ్చటకని..' వంటి చక్కని పాటలతో ప్రేక్షకులను మైమరించారు. ఇక విద్యార్థులు 'రామా కోదండ రామా.. కళ్యాణ రామా..', గంధము పూయరుగా.. పన్నీరు గంధము పూయరుగా..' ప్రదర్శనలు ప్రేక్షకుల మన్ననలను చూరగొని, కరతాళ ధ్వనులతో వేదిక మార్మోగింది. ఈ ప్రదర్శనలు త్యాగరాజ కవి యొక్క ఆధ్యాత్మిక లోతును, సంగీత వారసత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించాయి. శాస్త్రీయ సంగీతం, నృత్యం, సంప్రదాయాన్ని మేళవించి, నిర్వహించిన ఈ ఆరాధన సుసంపన్నమైన సాంస్కృతిక అనుభవాన్ని అందించడమే గాక, మనదేశ గొప్ప కళాత్మక వారసత్వాన్ని కాపాడటానికి గీతం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించింది. లలిత, ప్రదర్శన కళల విభాగం సమన్వయకర్త డాక్టర్ వై. లలితా సింధూరి పర్యవేక్షణలో, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆనందు మురళి, దర్భా మృదురవళి ఈ ఆరాధనా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# మానవ సేవే మాధవ సేవ

# నిస్వార్ధ సేవకుడు గురిజాల గోపి

## పేద ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభించిన గోపి

మణుగూరు, ఫిబ్రవరి 02 (భారతశక్తి): మానవ సేవే మాధవ సేవ తోటి మనుషులకు, పేదలకు నిస్వార్థంగా సేవ చేసే గుణవంతుడు, కరోన కాలంలో ఆకలితో ఉన్నవారికి, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేసిన మహోన్నతమైన వ్యక్తి ఏవరంటే టక్కున గుర్తుకు వచ్చే వ్యక్తి సీనియర్ కాంగ్రెస్ నేత గురిజాల గోపి. మణుగూరు పట్టణంలో నిరుపేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో మెరుగైన వైద్య సేవలు అందించడానికి సోమవారం ప్రగతి హాస్పిటల్ లో డాక్టర్ ఎండీ మొహిద్దీన్ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీస్సులు, మాజీ కేంద్రమంత్రి రాజ్యసభ సభ్యురాలు ఫైర్ బ్రాండ్ రేణుకా చౌదరి ఆదరణతో పినపాక నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సారధ్యంలో ప్రతి సోమవారం ఉచితంగా వైద్యం, మందులు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టామని గోపి పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రోజుల్లో అనారోగ్యంతో ప్రవేట్ హాస్పిటల్ కు వెళ్తే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంధాలయాల సంస్థల చైర్మన్ పసుపులేటి వీరబాబులు ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రత్యేక సదుపాయాలు



కల్పించడానికి త్వరలో మా వంతు సహాయ సహకారాలు ఉ ంటాయని తెలిపారని గురిజాల గోపి తెలియజేశారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు 150 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారని, వారికి పెనుగంచిప్రోలు తిరుపతమ్మ టెంపుల్ మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవులు- రాణి దంపతులు ఉచితంగా మందుల పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజా ప్రతినిధులు, ఉచిత మెగా వైద్య శిబిరానికి సేవలందించడానికి రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ, మహిళా సభ్యులు సీనియర్ నాయకురాలు ఎండీ షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డీబోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం శైలజ, సౌజన్య డాకూరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ షరీఫ్, మాధవ రెడ్డి, చారి, యువజన నాయకులు గురజాల సందీప్, గురజాల సాయి కుమార్ కిషన్ నాయక్, రామకృష్ణ, హేమంత్ నాయక్, హేమంత్ రెడ్డి, మహిళా నాయకులు ప్రగతి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి: ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 02(భారతశక్తి): గిరిజన దర్బార్ లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించడానికి వచ్చే గిరిజన కుటుంబాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ



సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో వివిధ సమస్యల గురించి విన్నవించడానికి వచ్చిన గిరిజనుల నుండి యూనిట్ అధికారుల సమక్షంలో ఆయన అర్జీలు స్వీకరించి, ఐటీడీఏ పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గిరిజన దర్బార్ కు ఎక్కువ శాతం గిరిజనులు పోడు భూముల పట్టాల కొరకు, గిరి వికాసం ద్వారా సబ్సిడీపై కరెంటు, బోరు, మోటార్ల కొరకు, పోడు భూముల పట్టాలు ఆన్లైన్ చేయించుట కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఆర్థిక వెసులుబాటు కల్పించుట కొరకు, అలాగే భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ,గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి బోరు, మోటార్లు ఇప్పించుట కొరకు, మారుమూల ప్రాంత గిరిజన గ్రామాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం, కరెంటు ఇప్పించుట కొరకు, నూతనంగా మత్స్య సొసైటీలు ఏర్పాటు కొరకు, వితంతు, ఒంటరి మహిళ, ఆసరా పెన్షన్లు ఇప్పించుట కొరకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో జీవనోపాధి పెంపొందించుకోవడానికి వ్యక్తిగత శిక్షణలు ఇప్పించుట కొరకు, అలాగే దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం అందించుట కొరకు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపులో జరిగిన తప్పులను సరిదిద్దుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన తెలిపారు. జూలూరుపాడు మండలం గురువాగు తండా గ్రామానికి చెందిన తులసి సోలార్ విద్యుత్ కనెక్షన్ బోరు మోటారు ఇప్పించుట కొరకు, అశ్వాపురం మండలం మామిళ్ళ వాయి గ్రామానికి చెందిన గిరిజనులు పోడు భూములలో సోలార్ విద్యుత్ కనెక్షన్ ఇప్పించుట కొరకు, పెనుబల్లి మండలం వియంబంజర గ్రామానికి చెందిన లక్ష్మీ, పినపాక మండలం తొగూడెం గ్రామానికి చెందిన పాపమ్మ భూ సమస్యలు పరిష్కరించుట కొరకు, ములకలపల్లి మండలం సీతయ్య గూడెం గ్రామానికి చెందిన సాలమ్మ ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించుట కొరకు, సత్తుపల్లి మండలం కాకరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పోడు పట్టాలు ఇప్పించుట కొరకు, ఏంకూరు మండలం రఘునాధపాలెం గ్రామానికి చెందిన రాధా వ్యవసాయ బోరు మోటర్ ఇప్పించుట కొరకు, చర్ల మండలం సున్నం గుంపు గ్రామానికి చెందిన ఇసుక సొసైటీ మహిళలు ఇసుక సొసైటీ కి సంబంధించిన సమస్యలు పరిష్కరించుట కొరకు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీఓ పవర్ వేణు,ఎస్ డిసి ఉదయ్ కుమార్, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఏ డి ఎం హెచ్ ఓ సైదులు, ఏవో సున్నం రాంబాబు, ఉ ద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏ పీ ఓ పవర్ వేణు, పి వి టి జి అధికారి గన్య, మేనేజర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, జేడియం హరికృష్ణ, ఎల్ టి ఆర్ డి టి నాగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ హేమంత్, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది లింగా నాయక్, మోహన్, భార్గవి, రామ్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి: జిల్లాఎన్నికల అధికారి రాహుల్ శర్మ



భూపాలపల్లి జిల్లా (భారత శక్తి) ఫిబ్రవరి 2:జిల్లా ఐడిఓసి కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పిఓ, ఓపిఓ విధులు నిర్వహించే సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాక్ పోలింగ్, ఓటర్ల గుర్తింపు, బ్యాలెట్ బాక్సులు భద్రత, ఓటింగ్ ముగిసిన తర్వాత చేపట్టాల్సిన ప్రక్రియలపై సిబ్బందికి వివరించారు. ఎలాంటి చిన్న తప్పిదాలు చోటుచేసుకోకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పరిస్థితుల్లో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎన్నికల విభాగ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, పిఓలు, ఓపిఓలు తదితరులు పాల్గొన్నారు.

# జాతర ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రతిపక్ష కుట్రలు : మంత్రి సీతక్క.

## -కేటీఆర్ దురహంకారం తగ్గించుకో

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 02 (భారత శక్తి): ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర ప్రతిష్టను దెబ్బతీసేలా కావాలనే కొంతమంది రాజకీయ పార్టీలు, కొన్ని మీడియా సంస్థలు, కొందరు స్వాములు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ -శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియాసమావేశంలో ఆమె మాట్లాడారు. మేడారం జాతర నిర్వహణలో భాగంగా వారం రోజుల పాటు తాము 24 గంటలూ అక్కడే ఉండి పనిచేశామని, కోట్లాది మంది భక్తులు సుఖశాంతులతో దర్శనం చేసుకున్నారని తెలిపారు. జాతరను సక్సెస్ చేయడంలో సహకరించిన ములుగు జిల్లా మీడియా సోదరులకు, అధికారులు, పోలీసులు, పారిశుధ్య సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గుడి నిర్మాణం ప్రారంభమైన నాటి నుంచే ఆదివాసీ విశ్వాసాలకు వ్యతిరేకమని తప్పుడు ప్రచారాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. గుడిలో చేసిన ప్రతి మార్పు పూజారుల ఆమోదం, ఎండోమెంట్ కమిషనర్ అనుమతితోనే జరిగిందని స్పష్టం చేశారు. అయినప్పటికీ సమ్మక్క గద్దెల వద్ద కూడా రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. శుక్రవారం సాయంత్రం విఐపి వాహనాలు భారీగా రావడంతో కొంతసేపు ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడిందని, అది బస్సులు లేకపోవడం వల్ల కాదని తెలిపారు. గత జాతరలతో పోలిస్తే



ఈసారి ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గాయని పేర్కొన్నారు. కొంతమంది విఐపిలు వందలాది మందితో, అనేక వాహనాలతో రావడం వల్లే ఇబ్బందులు తలెత్తాయన్నారు.

వ్యక్తిగత భూముల్లో జరిగిన చిన్న వ్యాపారాలను కూడా దందాలుగా చిత్రీకరించడం కుట్రపూరితమని మండిపడ్డారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమాలు చేస్తే తామే బాధ్యత వహిస్తామని స్పష్టం చేశారు. జాతరలో ప్రమాదాలు జరుగుతాయని, ప్రాణనష్టం జరుగుతుందని యూట్యూబ్‌లు, టీవీ ఛానళ్లలో చేసిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని అన్నారు.

ఈసారి మాస్‌తో పాటు క్లాస్, సూపర్ క్లాస్ భక్తులు కూడా పెద్ద ఎత్తున రావడం కొందరికి జీర్ణించుకోలేక నెగటివ్ నరేటివ్‌ను సృష్టిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలపై మాట్లాడితే మాట్లాడొచ్చుగానీ, దేవతలను, జాతరను కించపరచడం సహించబోమన్నారు. జాతరలో 13 వేల మంది పోలీసులు, 40 రోజుల పాటు జిల్లా యంత్రాంగం సేవలందించిందని తెలిపారు. తాగునీటి ట్యాంకులు, చలివేంద్రాలు, టాయిలెట్లు, షెడ్లు, తల్లులు,పిల్లల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామని వివరించారు. చిన్నచిన్న లోపాలు ఉంటే భవిష్యత్తులో సరిదిద్దుకుంటామని తెలిపారు. సమ్మక్క--సారలమ్మలు అన్ని కులాలు, అన్ని మతాలు నమ్మే ప్రకృతి దేవతలని, వారి కీర్తిని తగ్గించే కుట్రలను తక్షణమే మానుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడటమే తమ బాధ్యతని స్పష్టం చేశారు.

ములుగు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడ్డ ములుగు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరచిన 20 వార్డుల సభ్యులను ప్రతి ఒక్కరిని గెలిపించాలని ములుగు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సహకరించాలని ములుగు పట్టణ ప్రజలకు సూచించిన సీతక్క

2023 శాసన సభ ఎన్నికల్లో నన్ను ఎలాగైతే భారీ మెజారిటీతో గెలిపించి రాష్ట్రానికి మంత్రిని చేశారో అలాగే ములుగు మున్సిపాలిటీలో మొదటి సారి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరిని గెలిపించి ములుగు పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని మంత్రి అన్నారు.

ఇప్పటికే ములుగు పట్టణానికి 50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని మంత్రి సీతక్క కోరారు.

ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి. కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్,యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సేద సారంగం,×జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి,ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి,జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత శక్తి నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 02 (భారత శక్తి): నమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రజలకుప్రభుత్వానికి వారధిలా జర్నలిస్టులు పనిచేస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో

భారత శక్తి 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ భారత శక్తి దినపత్రిక వార్తల సేకరణలో ప్రచురణలో నిబద్దతతో పనిచేస్తుందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రచురణలో ముందుంటుందని అంతే నిబద్ధతతో తమ బాధ్యతగా మీడియా పనిచేయాలని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ శాఖ రాష్ట్ర డైరెక్టర్ భగవాన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, సీనియర్ నాయకుడు మల్లాడి రామ్



రెడ్డి, ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, నాయకుడు చింత నిప్పుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

## -మాజీ ఎమ్మెల్యే రేగా జిల్లా అధ్యక్ష హోదాకు అనర్హుడివి
## -ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేతలు

భద్రాద్రి జిల్లా బ్యూరో,ఫిబ్రవరి 02 (భారతశక్తి): కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అసభ్య పదజాలంతో అనుచితమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుమాలిన పని అని మణుగూరు మండల కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరమ్మ భవనంలో మణుగూరు మండల కాంగ్రెస్ నాయకత్వం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ మాట్లాడుతూ మాజీ ప్రజాప్రతినిధిగా, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష హోదాలో ఉన్న వ్యక్తి ఈ విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు, రాజకీయ నైతికతకు అనర్హుడవని విమర్శించారు. తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఎదిగి, ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ఈ రోజు కాంగ్రెస్ పార్టీపై దూషణలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాహిత పరిపాలనను బాధ్యతాయుతంగా చేస్తుందన్నారు. పినపాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి ఆదరణ, మద్దతు లభిస్తోందని, ఈ ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేక కొందరు కావాలనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ప్రజాస్వామ్యంలో సహజమని, అసభ్య పదజాలం, బెదిరింపులు, రౌడియిజం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని హితవుపలికారు.



ఇటువంటి వ్యాఖ్యలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. రౌడీయిజాన్ని పెంచి పోషించే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శివ సైదులు, కూచిపూడి బాబు, మహిళా అధ్యక్షులు సౌజన్య, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు , కూనవరం సర్పంచ్ ఎనిక శ్వత, కట్టు మల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, తోగ్గూడెం సర్పంచ్ మడకం క్రిష్ణ, లంకమల్లారం సర్పంచ్ పూనెం రమేష్, సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డ్ సభ్యులు కోలపిన్ని మానస, కృష్ణవేణి, 14 టైర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, నసుయ్ రాష్ట్ర నాయకులు ఆరిఫ్ పాషా, ఐఎన్ టీయుసి నాయకులు జాన్, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, తుపూడి శ్రీను కుర్రం రవి, బాలు, రాంరెడ్డి మధు, అబ్దుల్లా మహబూబ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# భైంసా అభివృద్ధి ఎంఐఎం పార్టీతోనే సాధ్యం : మహమ్మద్ అమీర్ అహ్మద్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 02 ( భారత శక్తి):భైంసా పట్టణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం జోరుగా కొనసాగుతోంది. రెండవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మహమ్మద్ అమీర్ అహ్మద్ ప్రజల ముందుకు వచ్చి అభివృద్ధి అజెండాతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ గతంలో ఎంఐఎం పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. చిన్నా--పెద్దా తేడా లేకుండా పార్టీ శ్రేణులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు. భైంసా పట్టణాన్ని ఆధునిక హైటెక్ పట్టణంగా తీర్చిదిద్దింది ఎంఐఎం పార్టీనేనని, ఇది ఒక్కరి వల్ల సాధ్యమైనది కాదని, సమిష్టి కృషితోనే సాధ్యమైందని నాయకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా పట్టణ అభివృద్ధి ఎంఐఎం పార్టీతోనే సాధ్యమని వారు స్పష్టం చేశారు.

ఈ ఎన్నికల్లో పతంగి గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి మహమ్మద్ అమీర్ అహ్మద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలు ప్రజలను కోరారు. ఎంఐఎం పార్టీ గెలుపుతోనే భైంసా పట్టణానికి మరింత అభివృద్ధి, సంక్షేమం అందుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి: దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్

భూపాలపల్లి జిల్లా ( భారత శక్తి) పిబ్రవరి 2:

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్ల పై దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ కాళేశ్వరం లో గత సంవత్సరం సరస్వతి పుష్కరాలు అంగరంగ వైభవంగా నిర్వహించామని, లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఈ సంవత్సరం మే 21 నుండి నిర్వహించబోయే సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం సుమారు 30.60 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. లక్షలాది భక్తులు అంత్య పుష్కరాలలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చే అవకాశం ఉందని, భక్తుల సౌకర్యార్థం త్రాగు నీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణతో పాటు విద్యుత్ సరఫరా, దేవస్థానం ప్రాంగణంలో భక్తుల క్యూలైన్ల ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సరస్వతి ఆది పుష్కరాలలో చేపట్టిన శాశ్వత ప్రాతిపదిక పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రసాదం కౌంటర్, రైలింగ్, సరస్వతి విగ్రహం వద్ద పెయింట్ వర్క్స్ గ్రానైట్ పరచడం

అర్చ్ ల నిర్మాణం, విద్యుత్ పనులు, పెయింట్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

లైన్ డిపార్ట్ మెంట్లతో సమావేశం నిర్వహించి అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏర్పాట్లు కావాలసిన శాఖ పరమైన మంజూరులను వెంట వెంట నే పూర్తి చేసి టెండర్ లను పిలవాలని పనులు మొదలుపెట్టి నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని ఆమె తెలిపారు. 8వ తేదీ వరకు అంచనా ప్రతిపాదనలు అందచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పి సంకీర్త్, అదనపు కలెక్టర్ ఆశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పంచాయతి రాజ్, దేవాదాయ, వైద్య, ఆర్ అండ్ బి, విద్యుత్తు, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా విశ్వాసమే మా నిజమైన బలం,ప్రతిపక్షాల ఆరోపణలు అభివృద్ధిని ఆపలేవు: మహ్మద్ జాబిర్ అహ్మద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 02 (భారత శక్తి ):మాజీ మున్సిపల్ చైర్మన్ మరియు మజ్లిస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ జాబిర్ అహ్మద్ నాయకత్వంలో ఆదివారం, భైంసాలోని మినీ దారుస్సలాం, అసద్ బాబా నగర్‌లో అత్యవసర విలేకరుల సమావేశం నిర్వహించారు. మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ, కాంగ్రెస్ మరియు బీజేపీ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు వారి రాజకీయ వైఫల్యం మరియు నిరాశను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు. వారి ప్రకటనలలోని వైరుధ్యాలను ఆయన ఎత్తి చూపారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌కు బీజేపీతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తుండగా, మరోవైపు స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రామారావు పాటిల్ బీజేపీ, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలన్నీ కలిసే ఉన్నాయని చెబుతున్నారని ఆయన అన్నారు. ఈ పరస్పర విరుద్ధమైన ప్రకటనలు ప్రతిపక్ష పార్టీలలోని గందరగోళాన్ని మరియు విశ్వసనీయత లోపాన్ని బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. జనవరి 28న భైంసాలోని ఒక విందు మందిరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే చేసిన ప్రకటనపై స్పందిస్తూ, భైంసా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని 25 స్థానాల్లోనూ గెలుస్తుందని చేసిన వాదనకు సంబంధించి, మహ్మద్ జాబిర్ అహ్మద్ ఖానాపూర్ ఎమ్మెల్యేకు మరియు డీసీసీ అధ్యక్షుడికి బహిరంగ సవాల్ విసిరారు. భైంసాలోని ఏ ఒక్క వార్డులోనైనా ఒక్క సీటు గెలిచినా వారి వాదనను తాను అంగీకరిస్తానని ఆయన అన్నారు. భైంసా ప్రజలు, ముఖ్యంగా ముస్లిం సమాజం తనపై మరియు మజ్లిస్‌పై పూర్తి విశ్వాసం కలిగి ఉన్నారని ఆయన చెప్పారు. గత 20 సంవత్సరాలుగా మజ్లిస్ కేవలం అభివృద్ధి పనుల ద్వారానే ప్రజలకు సేవ చేస్తోందని, ఈ వాస్తవం గురించి ప్రజలకు పూర్తి అవగాహన ఉందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో జరిగిన అన్యాయాన్ని కూడా ఆయన హైలైట్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్ పటేల్ మరియు జి. విఠల్ రెడ్డి వివక్షాపూరిత పద్ధతులను అనుసరించారని, ఎంపిక చేసిన కొందరికి లక్షల రూపాయలు ఇచ్చారని, అయితే మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులను విస్మరించి చాలా తక్కువ మొత్తాలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో బీజేపీ మరియు కాంగ్రెస్ కలిసి పనిచేసి అభ్యర్థులను నిలబెట్టలేదని, అయితే భైంసాలోని చైతన్యవంతులైన ప్రజలు ఇటువంటి కుట్రలన్నింటినీ ఓడిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పత్రికా సమావేశం ముగింపులో, మహ్మద్ జాబిర్ అహ్మద్ మజ్లిస్ కార్యకర్తలను ఐక్యంగా ఉండి, నిజాయితీ మరియు అంకితభావంతో ప్రజా సేవను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. భైంసా విజయం అభివృద్ధికి మరియు ప్రజల నమ్మకానికి లభించిన విజయంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పత్రికా సమావేశంలో భైంసా టౌన్ మజ్లిస్ అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్ మరియు అడ్వకేట్ ఇంతియాజ్ అహ్మద్.పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం: జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 02 (భారత శక్తి):

సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ



ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో ఎక్స్ అఫిషియోల ఎంపిక కొరకు నోటీసులు జారీ చేసి ఆప్షన్ తీసుకోవాలి: రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని.





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 02 (భారత శక్తి):సోమవారం జిల్లా కలెక్టర్లు, అధికారులకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

పరోక్ష విధానం ద్వారా చేసే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, రాజ్య సభ సభ్యులు ఎక్స్ అఫిషియో హోదాలో ఏదో ఒక మున్సిపాలిటీని ఎంచుకొని ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సెక్షన్ 5, 20 ప్రకారం ప్రజా ప్రతినిధులు ఒక మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించేందుకు ఆప్షన్ ఇచ్చుకొని ఉండాలని, అలా కాకుండా ఇంతవరకు ఆప్షన్ ఇవ్వని పక్షంలో నిబంధన ప్రకారం మున్సిపల్ ఎన్నికలు అయిన 30 రోజుల్లో ఆప్షన్ ను సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనికొరకు ఫిబ్రవరి, 11 నుండి 14వ తేదీ లోపు నోటీస్ జారి చేసి ప్రజాప్రతినిధుల నుండి ఆప్షన్ తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాకు సంబంధించిన ప్రజా ప్రతినిధులకు, నిబంధనల ప్రకారం ఫిబ్రవరి, 11 నుండి 14వ తేదీ లోపు నోటీస్ లు జారీ చేసి ఆప్షన్ తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో వీకెండ్--స్పెషల్ డ్రంక్ & డ్రైవ్... 340 మందిపై కేసులు

సైబరాబాద్, ఫిబ్రవరి 02(భారత శక్తి):

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు.



ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 340 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 275 ద్విచక్ర వాహనదారులు, 14 ఆటోలు, 48 కార్లు, 03 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.

బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే --- 273 మంది 35 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 46 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 21 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.

వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.

గత వారం (26.01.2026--31.01.2026)లో మొత్తం 257 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో 05 మందికి జరిమానా, జైలు శిక్ష, 12 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 240 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# ప్రజావాణి కి 81 దరఖాస్తులు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 02: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లోని 25 వ నెంబర్ లో అర్జీదారుల నుండి కలెక్టరేట్ సయీద్ అహ్మద్ మస్రూర్, ఏఓ అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన వివిధ సమస్యల పై 81 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఈ గ్రీవెన్స్ లో జిల్లా అధికారులు, ఆర్. స్వప్న, సూపరింటెండెంట్ (సి-సెక్షన్), వి. అనిల్, సూపరింటెండెంట్ (ఎఫ్-సెక్షన్)తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లు పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కై ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి.

దేశాభివృద్ధిలో పట్టణీకరణ ఆధునికీకరణ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో పట్టణాల అభివృద్ధి విస్తరణ ప్రాముఖ్యత సంతరించుకుని ఉంది. ప్రపంచీకరణ విసురుతున్న పోటీని తట్టుకోవాలంటే పట్టణాలు ఆధునిక రీతిలో శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందాలి.

నగరాల/ పట్టణాల అభివృద్ధి అనేది మెరుగైన మున్సిపాలిటీల పాలన విధానాల మీద ఆధారపడి ఉంటుంది. మున్సిపాలిటీలకు నిర్దిష్ట కాలములో ఎన్నికల నిర్వహించి స్థానిక స్వపరిపాలనకు ప్రభుత్వంచర్యలు తీసుకుంటుంది. స్థానిక సంస్థల సాధికారితలో భాగంగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తుంది. మున్సిపాలిటీలో/ మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు/డివిజన్ / కౌన్సిలర్/ కార్పొరేటర్ ల పాత్ర ప్రధాన మైంది. వార్డు /డివిజన్/ పట్టణం అభివృద్ధి ప్రజలు ఎన్నుకునే కౌన్సిలర్ కార్పొరేటర్ నాయకత్వ దక్షత మీద ఆధారపడి ఉంటుంది ఎవరిని ఎన్నుకోవాలి? అనేది ఓటర్ల విజ్ఞతపై ఆధారపడి ఉంటుంది.

ఓటు తల రాతను మార్చే సాధనం

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఓటు మాత్రమేకాదు అది మన తలరాతనుమార్చే సాధనం.

వార్డ్/ డివిజన్/పట్టణ ప్రజల భవిష్యత్తును పిల్లల భవిష్యత్తు నిర్ధారించే ఒక వజ్రాయుధం. ఎన్నికల్లో డబ్బు ఉచిత ప్రలోభాలు మద్యం కులం బంధువుల వ్యామోహం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మాయమాటల వ్యామోహంలో పడి ఓటర్లు తప్పుడు వ్యక్తిని ఎన్నుకుంటున్నారు. ఫలితంగా నగరాలు పట్టణాలు అభివృద్ధి చెందడం లేదు. పట్టణాలు మురికి కూ పాలుగా కాలుష్య కాసారాలుగ

మారిపోయి ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.ఓటరు తమ ఓటును అభివృద్ధి వైపే వేయాలి అనేధి నినాదానికే పరిమితం చేయకుండా అభివృద్ధికి పాటుపడే అభ్యర్థికేఓటువెయ్యాలి. వార్డ్ / డివిజన్ / పట్టణ ప్రగతిని కాంక్షించే వారిని కౌన్సిలర్ గా/ కార్పొరేటర్ గాఎన్నుకోవాలి.

వార్డు/ డివిజన్/ పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే ఉత్తమ అభ్యర్థిని కౌన్సిలర్ గా/ కార్పోరేటర్ గా ఎన్నుకోవాలి.

రాష్ట్రంలో జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్/ కార్పొరేటర్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థుల నేర చరిత్ర' ప్రజాసేవలో వారు చేసిన గణనీయమైన సేవలు ప్రజలతో వారికి వున్న ప్రజా సంబంధాలు' ప్రజలకు ఎల్ల వేళలా అందు బాటులో వుండి వార్డ్/ డివిజన్ / పట్టణ భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను పెంపొందించే శక్తిసామర్థ్యాలు కలిగి పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటు పడే ఉత్తమ అభ్యర్థులను విజ్ఞత గల ఓటర్లు తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలి.

అందుబాటులో ఉండే వ్యక్తిని ఎన్నుకోవాలి

వార్డు/ డివిజన్/(పట్టణ) సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలి. ఆపదలో నేను ఉన్నాను అని భరోసా ఇచ్చే నాయకత్వం కావాలి . ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు భరోసానిచ్చి ముందు నిలబడే నిజమైన నాయుకుడు కావాలి. గెలిచిన తర్వాత కనపడకుండా పోయేవాడు కాదు .కష్టంలో ప్రజల మధ్య ఉండేవాడు మనకు కావాలి. ఎన్నుకునే వ్యక్తి ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించాలి. సామాన్యులకు అందుబాటులో ఉండాలి .నిజాయితీగా సేవా దృక్పథం కలిగిన వ్యక్తిని

కౌన్సిలర్ గా / కార్పోరేటర్గా ఎన్నుకోవాలి.ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టి గెలిచేవాడు ఆ డబ్బును సంపాదించడం మీద దృష్టి పెడతాడు నిధులను దుర్వినియోగం చేస్తాడు .అవినీతి పాలనకు తెరతీస్తాడు. ప్రజల అభిమానాన్ని నమ్ముకుని సేవ చేయాలనే తపన ఉన్న వ్యక్తిని ఎన్నుకుంటే వార్డు /డివిజన్/ పట్టణం అభివృద్ధి జరుగుతుంది .అవినీతి లేని నేర రహితుడు నిజాయితీ పరుణ్ణి ఎన్నుకుంటే ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు యొక్క లాభాలు ప్రత్యక్షంగా ప్రజలకు చేరుతాయి. కౌన్సిలర్ /కార్పొరేటర్ పదవికి పోటీ చేసే అభ్యర్థి వార్డు/డివిజన్లో/ పట్టణంలో విద్యా వైద్య ఆరోగ్య5 వాతావరణ పర్యావరణ రంగాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తాడో? ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల అమలుకు నిధులను ఏ విధంగా సమీకరిస్తాడో బహిరంగంగా ప్రకటించాలి.

వార్డు / డివిజన్/పరిస్థితులపై అవగాహన ఉన్న వ్యక్తిని కౌన్సిలర్ కార్పొరేటర్గాఎన్నుకోవాలి

వార్డులో/ డివిజన్లో /పట్టణంలో లభించే భౌతిక వనరులు' సహజ వనరులు 'భౌగోళిక స్థితి గతుల మీధ అవగాహన వున్న విద్యావంతున్ని మేధావిని గుర్తించి ఓటువేయ్యాలి. స్థానికంగాప్రజలకు అందుబాటులో వుండి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి వార్డు /డివిజన్ ప్రజల అభివృద్ధికి పాటుపడే అభ్యర్థులను కౌన్సిలర్ గా /కార్పోరేటర్ గాఓటర్లు ఎన్నుకోవాలి.

ప్రలోభాలు వద్దుబి నిజాయితీలి ముద్దు"

వార్డు /డివిజన్లోని (పట్టణ)ఓటర్లు ప్రలోభాలకు లొంగవద్దు.నోటుకు ఓటు అమ్ముకోవద్దు. ఎన్నికల సమయంలో ఇచ్చే 5 వేల రూపాయలకు ఆశపడి భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దు. నాయుకుడు ఎన్నికల్లోకోట్లు ఖర్చు చేసి గెలిచిన తర్వాత అంతకుమించి సంపాదిస్తాడు. ప్రజలను దోపిడి చేస్తాడు. ప్రజలకు సేవ చేయాలనే స్పృహ నేటి నాయకుల్లో లేదు. ఈరోజు డబ్బు తీసుకొని మనం ఓటు వేస్తే రేపు మన వార్డ్/డివిజన్కు కావాల్సిన మౌలిక మవసతులు రోడ్లు 'విద్య ఆరోగ్యం సదుపాయాలు రావు.

ప్రశ్నించే హక్కును కోల్పోతాము.

నోటుకు ఓటు భవిష్యత్తుకు ముప్పుగా భావించాలి.

ప్రజా సేవకులను కౌన్సిలర్ గా కార్పోరేటర్స గా ఎన్నుకోవాలి.

ఓటర్లుఎలాంటి ఒత్తిడికి భయానికి తల వంచకుండ హేతుబద్ధంగా వ్యవహరించాలి. ప్రజలకు సేవ చేస్తున్న వారిని నిజంగా పనిచేయడానికి సిద్దంగా ఉన్న అభ్యర్థికి ఓటు వెయ్యాలి.

సెంటిమెంట్ పై ఓటు వేయరాదు

కౌన్సిలర్ /కార్పొరేటర్అభ్యర్థి మనకులం మన మతం' మన బంధువు మా అన్నమా తమ్ముడు మా బావ మామామ అనే సెంటిమెంట్లతో ఓటు వేయడం అభివృద్ధికి అవరోధం. నాయకుడు సమర్ధుడా? కాదా ?ప్రజా సమస్యలు పై అవగాహన ఉందా లేదా ?అని ఆలోచించాలి ?

అభ్యర్థి ఏ పాటి వాడో చూడాలి.

కేవలం కులం మతం బంధుత్వం వర్గం ప్రాతిపదికన ఓటు వేస్తే గెలిచిన నాయకుడు తన కులానికి తన వర్గానికి మేలు చేస్తాడు . వార్డుకు డివిజన్ కు న్యాయం చేయలేడు.

వార్డ్/ డివిజన్ /పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే వారిని ఎన్నుకోవాలి.

అభివృద్ధికి కులం లేదు. ఆకలికిఎ మతం లేదు. రోడ్లు 'తాగు నీరు 'బడి మౌలిక వసతులు' పర్యావరణం ప్రజలందరికీ కావాలి. సంకుచిత భావాలనుండి ఓటరు బయటపడి వార్డు /డివిజన్ సమగ్ర అభివృద్ధి కొరకు పాటుపడే సామర్థ్యం నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తిని కౌన్సిలర్ గా కార్పొరేటర్ ఎన్నుకుంటేనే వార్డు/ డివిజన్ / పట్టణ ప్రజల జీవితాలలో వెలుగులు వస్తాయి. ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రగతి పురోగతి కోసం మనస్ఫూర్తిగా పని చేస్తానని నమ్మే అభ్యర్థికి ఓటు వెయ్యాలి.

నిజాయితీ సామాజిక సేవ ఎన్నికకు గీటురాయిలి.

నిజాయితీ గల అభ్యర్థికి ఓటు వెయ్యాలి. ఒక అభ్యర్థిని ఎన్నుకునేటపుడు అభ్యర్థి ఎంత సామాజిక సేవ చేశాడన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. సామాజిక సేవా పాలనా దక్షత ప్రజా సంబంధాలు నిబద్ధత నీతి నిజాయితీ అభ్యర్థి ఎన్నికకు గీటు రాయి కావాలి.ఓటర్లు మద్యానికి మందుకు బీరు బిర్యాని ముక్క చుక్కకు బానిసలై అవినీతి పరులను ఎన్నుకోవద్దు. అసమర్తులను అవినీతి పరులను ఓటుతో వేటు వెయ్యాలి . ఓటు ద్వారా వారిని బహిష్క రించాలి.

ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి

ఓటర్లు గాఢ నిద్ర మానుకొని ఉత్తమఅభ్యర్థులనుఎన్నుకోవాలి.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో కౌన్సిలర్గా /కార్పొరేటర్ గా బాధ్యతలను నిర్వహించే సామర్థ్యం వున్న వారిని గుర్తించాలి . విద్యావంతులైన అభ్యర్థి మెరుగైన నిర్ణయాలు తీసుకోగలడని సాధారణ ఓటరు అర్థం చేసుకోవాలి. కౌన్సిలర్/ కార్పొరేటర్ అభ్యర్థి కి వార్డు డివిజన్ స్థితి గతులు పరిస్థితుల మీద మేధస్సుతో కూడిన దూర దృష్టితో కూడిన అభివృద్ధి దృక్పథం కలిగి వుండాలి.నేర రికార్డులు ఉన్న అభ్యర్థిని బహిష్కరించాలి. ఉచితాలకు స్వస్తి పలకాలి. ఉచితాలు ప్రకటించి ఓటర్లను ఆకర్షించేందుకు చేసే చర్యలు

చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించి అభ్యర్థి పైన ఎన్నిక కమిషన్ చర్యలుతీసుకోవాలి.

పరిస్థితులపై అవగాహన

వార్డు/ డివిజన్ /(పట్టణ) పరిస్థితులపై సంపూర్ణ అవగాహన.

సామాజిక ఆర్థిక చారిత్రిక సాంస్కృతిక అంశాల పై అవగాహన వుండాలి.

కౌన్సిలర్ /కార్పొరేటర్ అభ్యర్థులకి వార్డు డివిజన్ సరిహద్దులు తెలిసివుండాలి. ప్రభుత్వ భూమిరక్షణ వినియోగం పబ్లిక్ పార్కు వినియోగం విస్తరణ వీక్లీ సంత మార్కెటింగ్ 'స్టోరేజ్ సౌకర్యాలు 'ఉత్పత్తి ఉత్పాదకత చిన్న ' కుటీర లఘు ' పరిశ్రమలు పెట్టుబడి వాటి నిర్వహణ పనితీరు ఉపాధి సృష్టి ఆదాయ సృష్టి 'అటవీ సంరక్షణ 'పర్యావరణ ప్రకృతి విపత్తుల చట్టాల పట్ల అవగాహన పరిజ్ఞానం ఉండాలి.

సంక్షేమ చట్టాల పట్ల అవగాహన

మహిళా ' యువజన' ఎస్సి ఎస్టీ 'బిసి సాధికారిత సంక్షేమం అభివృద్ధి పథకాలు చట్టాల పట్ల అవఘానుండాలి నిర్ణిత కాలములో వారినిఅమలు చేసే సత్తా ఉండాలి..విద్యుత్ శక్తి తాగునీటివనరుల ప్రాజెక్ట్ నిర్మాణం నాణ్యత పట్ల అవగాహన పరిజ్ఞానం కలిగిన అభ్యర్థికి ఓటర్లు తమ ఓటు హక్కుతో మద్దతు ప్రకటించాలి.

వార్డు/ డివిజన్ భివృద్ధిపై విజన్ ఉండాలి

కౌన్సిలర్గా/ కార్పొరేటర్ గా పోటీ చేసే అభ్యర్థికి వార్డు డివిజన్ అభివృద్ధిపై స్పష్టమైన విజన్ ఉండాలి.

వార్డు/ డివిజన్ లోని ప్రజల జీవన విధానం విధ్య' వైద్య రావణా 'కరంట్ ' డ్రైనేజ్ మౌలిక వసతుల కల్పనకు సామాజిక అవస్థాపన పెట్టుబడులు 'మూలధన వనరుల సమీకరణ వనరుల అభిలషణీయ వినియోగం పట్లనిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేసిన విశ్వసనీయ అభ్యర్థులకు విజ్ఞత గల ఓటర్లు ఓటు వెయ్యాలి.

చట్టాలపై అవగాహన ఉండాలి

కౌన్సిలర్ /కార్పొరేటర్ గా పోటీ చేసే అభ్యర్థికి రాజ్యాంగం పట్ల అవగాహన స్థానిక సంస్థల చట్టాల మీద పరిజ్ఞానం కలిగిన అభ్యర్థికి ఓటు వెయ్యాలి. కేంద్ర ప్రభుత్వం నుండి ఫైనాన్స్ కమిషన్ నుండి నిధులను తీసుకు వచ్చే అధికారులతో ఉత్తమ సంబంధాలు పరిజ్ఞానం ఉండాలి.అర్బన్ డెవలప్మెంట్ చట్టాలు రెవెన్యూ చట్టాలు అటవీ చట్టాలు పారిశ్రామిక చట్టాలు మహిళా యువత ఎస్సి' ఎస్టీ 'బీసీ మైనార్టీలు హక్కుల రక్షణ భద్రత సంక్షేమ పథకాలు ప్రాజెక్టుల అమలు కొరకు వున్న చట్టాల పట్ల అభ్యర్థులు అవగాహన పరిజ్ఞానం కలిగి వుండాలి.వార్డు/ డివిజన్/ప్రగతి సమీక్ష సమావేశాలు నిర్వహించాలి.

మేనిఫెస్టో అమలు సమీక్ష సమావేశాలు నిర్వహించాలిలి ఎన్నికైన కౌన్సిలర్ /కార్పొరేటర్ / ప్రతి 3 నెలలకు ఒక సారి వార్డు /డివిజన్/పట్టణ సభ విధిగా నిర్వహించాలి. ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న అంశాల అమలు పట్ల సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రగతి సంక్షేమ పథకాల అమలులో ప్రజలను భాగస్వాములను చెయ్యాలి.

వార్డు /డివిజన్లో లోని ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే పన్నులు వార్డు /డివిజన్అభివృద్ధికి కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు వాటి వినియోగం మీధ ఓటర్లతో సమావేశాలు నిర్వహించాలి.

ప్రజల వద్దకు పాలనను అందించాలి

ఎన్నికైన కౌన్సిలర్/ కార్పొరేటర్ లు వార్డు/ డివిజన్ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి.

ప్రజల పిర్యాదులను సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల ద్వారా వారం రోజుల్లో పరిష్కారమయ్యే పాలన విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రతి 3 నెలలకు ఒక సారి జిల్లా స్థాయి వివిధ విభాగాల అధికారులు వార్డు/డివిజన్ పరిధిలో ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎంపీల సమావేశాన్ని నిర్వహించి

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి. వార్డు / డివిజన్ ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి అసెంబ్లీకి పార్లమెంట్కు వెళ్ల లేరు. ఎమ్మెల్యేలు ఎంపీలు హాజరైతే ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై వారికి అవగాహన ఏర్పడుతుంది ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్యన సంబంధాలు

బలోపేతం అవుతాయి.

మునిసిపాలిటీ సిబ్బందిలో అధికారులలోజవాబుదారీతనం

పారదర్శనికతకు సుపరిపాలనకు చర్యలు చేపట్టాలి.

ప్రజల వద్దకు పాలనను చేర్చే చర్యలు చేపట్టాలి.ఓటర్ల అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి రక్ష

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవలిసిన బాధ్యత ఓటర్ల పై వుంది. ఓటర్లు అప్రమత్తంగా వుండి అర్హులైన అభ్యర్థులను కౌన్సిలర్ గా/ కార్పోరేటర్ గా ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి. అభ్యర్థుల హామీలను పరిశీలించి వారి పని తీరును పరిశీలించాలి.

వార్డు/డివిజన్ /పట్టణం భవిష్యత్తు విజ్ఞత గల ఓటర్ల చేతుల్లోనే ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు. డ్రగ్స్ 'అవినీతి భూ మాఫీయా ' ఇసుక మాఫియా ' పేదరికం నిరుద్యోగం సామాజిక' ఆర్థిక అసమానతలు 'లింగ వివక్ష లైంగిక వేదింపులు 'సామాజిక హింస బాలకార్మికులు నిర్మూలన వెట్టిచాకిరి యువత విద్యార్థుల ఆత్మహత్యలు మొన్నగు సమస్యలను తుడిచి పెట్టే సామర్థ్యం వున్న విద్యావంతులు

నిజాయితీ గల అభ్యర్తులను కౌన్సిలర్గా/ కార్పొరేటర్స్ గా ఓటర్లు ఎన్నుకోవాలి.

ప్రగతిశీలబి వార్డు /డివిజన్ బిఓటర్ల ప్రతిజ్ఞ

వార్డు/ డివిజన్ /(పట్టణాన్ని) ప్రగతి శీలంగా ప్రజాస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేసే అభ్యర్థిని కౌన్సిలర్/ కార్పొరేటర్ గాఎన్నుకుంటామని ఓటర్లుగా ప్రతిజ్ఞ చేద్దాం. సకల జనుల సంక్షేమానికి వార్డు /డివిజన్ /పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఓటేద్దాం. ఓటుతో ప్రజలజీవితాల్లో వెలుగులు తెద్దాం.



నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్
9440245771

# సినిమా

## దలైలామాకు గ్రామీ అవార్డు

సంగీత ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం అమెరికాలోని లాస్ ఏంజెలెస్ లో అట్టహాసంగా జరిగింది. హాలీవుడ్ ప్రముఖులు, అంతర్జాతీయ స్థాయి సంగీత విద్వాంసులు, గాయకులు, నిర్మాతలు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఈ ఏడాది గ్రామీ అవార్డులలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ప్రముఖ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు లభించిన గౌరవం. 90 ఏళ్ల వయస్సులో తొలి గ్రామీ అవార్డ్‌ని దక్కించుకొని రికార్డ్ సృష్టించారు. ఆధ్యాత్మిక సందేశాలు, శాంతి, మానవ విలువలపై ఆయన అందించిన ఆడియో బుక్‌కు.. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో ఈ అవార్డు దక్కింది. సాధారణంగా సంగీత రంగానికి సంబంధించిన పురస్కారాల మధ్య ఆధ్యాత్మిక గ్రంథానికి గుర్తింపు లభించడం దలైలామా అనుచరులకు ఆనందాన్ని కలిగించింది.




## చీరకట్టులో కయాదు లోహర్




మోడల్ గా కెరియర్ ను ప్రారంభించిన కయాదు లోహర్ 2021లో వచ్చిన కన్నడ చిత్రం మొగిల్ పేటతో నటిగా అరంగేట్రం చేసింది. ఈ సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత మలయాళం, తెలుగులో నటించినప్పటికీ.. తమిళంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా వచ్చిన డ్రాగన్ సినిమాతో ఒక్కసారిగా పాపులారిటీ దక్కించుకుంది. ఇప్పుడీ ఈ ముద్దుగుమ్మ తెలుగులో విశ్వక్ సేన్ తో జోడీగా నటించిన ఫంకీ సినిమాతో ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాలు చేపట్టారు మేకర్స్. అందులో భాగంగా కయాదు లోహర్ తన అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. చీరకట్టులో గ్లామర్ వలకబోస్తూ ఫొటోలు షేర్ చేసింది. బ్లూ అండ్ ఆరెంజ్ కాంబినేషన్ లో ఉన్న ఈ చీర ఈమె అందాన్ని రెట్టింపు చేసింది. ఈ అమ్మడి ఫొటోలకు అభిమానులు లవ్ , ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

## తగ్గేదెవరు?




ఆర్ఆర్ఆర్ మూవీ తర్వాత సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న రామ్ చరణ్ కు పెద్ది సినిమాపై భారీ అంచనాలున్నాయి. చెర్రీ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న విడుదల చేస్తామని మేకర్స్ ఎప్పుడో అధికారికంగా ప్రకటించారు. అయితే షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండటంతో విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయని టాక్ వినిపిస్తోంది. మే 1 రిలీజ్ చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారట. మరోవైపు అక్కినేని అఖిల్ నటిస్తోన్న లెనిన్ మూవీ కూడా మే 1నే రిలీజ్ కానుండటం చర్చనీయాంశంగా ఉంది. టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి పదేళ్లయినా ఇప్పటికీ ఒక్క హిట్టు కూడా కొట్టలేకపోయినా అఖిల్‌కి ఈ మూవీ కీలకంగా మారింది. ఏజెంట్ వంటి డిజాస్టర్ తర్వాత ఆయన నటిస్తోన్న చిత్రం కావడం, భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండటంతో ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఒకే రోజు రెండు సినిమాలు రిలీజైతే అఖిల్ మూవీకి పెద్ద దెబ్బ అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పెద్ది రిలీజ్‌పై మేకర్స్ మరోసారి అధికారిక ప్రకటన చేస్తే గానీ ఈ కన్ఫ్యూజన్‌కి తెరపడదు.




## రామ్‌చరణ్‌కు అల్లు అర్జున్ విషెస్.. చిరంజీవి గురించి ఏమన్నారంటే?



రామ్‌చరణ్ దంపతులకు అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపారు. నవ్వులతో నిండిన కుటుంబాన్ని చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ''మరోసారి తల్లిదండ్రులైన ఉపాసన రామ్‌చరణ్‌లకు శుభాకాంక్షలు. చిరంజీవి గారి గర్వం, ఆనందం ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కుటుంబం మొత్తం నవ్వుతూ కనిపిస్తుండటం సంతోషంగా ఉంది. చిన్నారులు తమ రాకతో ఎంతో ఆనందాన్ని తీసుకొచ్చారు'' అని పేర్కొన్నారు. నిర్మాత అల్లు అరవింద్, కొణిదెల కుటుంబానికి చెందిన నటులు, ఇతర సినీ ప్రముఖులు చరణ్ దంపతులకు విషెస్ తెలిపారు. జనవరి 31న కవలలకు జన్మనిచ్చారు ఉపాసన. అదేరోజు రాత్రి.. ఈ విషయాన్ని చిరంజీవి అభిమానులతో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఉపాసన, పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. చిన్నారుల రాకతో కుటుంబ సభ్యులు, చిరు, చరణ్ అభిమానులూ సెలబ్రేషన్స్ చేసుకున్నారు.

## అందుకే విడిపోయాం..

### మాజీ బాయ్‌ఫ్రెండ్ గురించి చెప్పిన మృణాల్ ఠాకూర్



కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. ''నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటివాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదు'' అని మృణాల్ తెలిపారు. కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

## ఓటీటీలో 'శంబాల' దూకుడు..

### 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్

ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

## చూడగానే దేవుడిలా కనిపించాలి.. 'రామాయణ'పై నటుడి కామెంట్స్

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమాలోని పాత్రల గురించి నటుడు అరుణ్ గోవిల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి చిత్రాల్లో నటీనటుల లుక్స్‌పై ప్రేక్షకులు ఎక్కువగా ఫోకస్ చేస్తారని తెలిపారు. వారిని జీవితమంతా అదే పాత్రలో గుర్తుంచుకుంటారని అన్నారు. రామానంద్ సాగర్ తెరకెక్కించిన 'రామాయణ్'లో అరుణ్ రాముడిగా కనిపించారు. అప్పటినుంచి రాముడి పాత్ర అనగానే ఆయనే గుర్తుండిపోయేలా అందులో కనిపించి ఆకట్టుకున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లో అరుణ్



గోవిల్ దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. దీని గురించి మాట్లాడుతూ.. ''ఏదైనా సినిమా వస్తుందంటే దానిని పోల్చడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మనం దేవుడి పాత్ర పోషించేటప్పుడు చూడగానే అలానే కనిపించాలని. లుక్స్ చాలా ముఖ్యం. ఆడియన్స్ తెరపై మనల్ని చూడరు.. మన పాత్రలో ఉన్న దేవుడిని చూస్తారు. బహుశా దేవుడు నిజంగా ఇలానే ఉండటాడేమో అనుకోవాలి. అంతలా మనం ప్రభావితం చేయాలి'' అని చెప్పారు. ఇక ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి చిత్రం దేనికదే ప్రత్యేకమన్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా రానున్న ఈ సినిమాలో సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4,000 కోట్లతో రూపొందించనున్నారు. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే దీన్ని భారీస్థాయిలో రూపొందిస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఇందులో రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.

# చెరువులకు 'జల'కళ.. ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం!

* బడంగ్‌పేట్ పరిధిలోని నాలుగు చెరువుల పరిశీలన
* గుర్రపుడెక్క తొలగింపు, కట్టల బలోపేతానికి ప్రతిపాదనలు
* రంగంలోకి జోనల్ కమిషనర్ చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ కమిషనర్ సరస్వతి; అధికారులకు కీలక ఆదేశాలు..




బడంగ్‌పేట్, ఫిబ్రవరి 2(భారత శక్తి): నగర శివార్లలోని చెరువులు త్వరలోనే కొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఆక్రమణల చెరలో చిక్కుకుని, గుర్రపుడెక్కతో నిరుపయోగంగా మారుతున్న జలవనరుల పునరుద్ధరణకు అధికారులు నడుం బిగించారు. సోమవారం బడంగ్‌పేట్ సర్కిల్ 16 పరిధిలోని కోమటికుంట, పెద్ద చెరువు, మంత్రాళ చెరువు, చందన చెరువులను జోనల్ కమిషనర్ (ZC) శ్రీమతి చంద్రకళ గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ పి. సరస్వతి పర్యవేక్షణలో జరిగిన ఈ పర్యటనలో చెరువుల ప్రక్షాళనపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**సమస్యల సుడిగుండంలో జలవనరులు:**

పరిశీలనలో భాగంగా చెరువుల దుస్థితిపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా గుర్రపుడెక్క (వాటర్ హైసింత్) సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. కలుపు మొక్కల వల్ల నీరు కలుషితమవ్వడమే కాకుండా, పరిసరాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రూపొందించిన అభివృద్ధి ప్రతిపాదనలను జోనల్ కమిషనర్ క్షుణ్ణంగా సమీక్షించారు.

**పునరుద్ధరణ ప్రణాళిక - ముఖ్యాంశాలు:**

* చెరువుల సంరక్షణ కోసం అధికారులు భారీ వ్యూహాన్ని సిద్ధం చేశారు:
* యంత్రాలతో క్లీనింగ్: పేరుకుపోయిన గుర్రపుడెక్కను అత్యాధునిక యంత్రాల ద్వారా పూర్తిగా తొలగించడం.
* పూడికతీత (Desilting): ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడికను తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం.
* కట్టల పటిష్టం: చెరువు బండ్లను బలోపేతం చేసి, ఆక్రమణలకు తావులేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం.
* నీటి మార్గాల పునరుద్ధరణ: ఇన్లెట్, అవుట్‌లెట్ చానల్‌కను సరిచేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడటం.

**శాశ్వత నివారణ:**

* భవిష్యత్తులో మళ్లీ కలుపు మొక్కలు పెరగకుండా శాస్త్రీయ చర్యలు చేపట్టడం.

**"పనుల్లో జాప్యం వద్దు: జోనల్ కమిషనర్.**

ప్రతిపాదనలను పరిశీలించిన జోనల్ కమిషనర్.. క్షేత్రస్థాయి అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో జాప్యం వహించవద్దని, కేవలం పనులకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అభినయ్ కుమార్, పి. వెంకన్న, ఏఈలు హరీష్, గంగా ప్రసాద్ తదితరులు పాల్గొని వివరణ ఇచ్చారు. ఈ ప్రక్షాళన చర్యలు సకాలంలో పూర్తయితే, బడంగ్‌పేట్ పరిధిలోని చెరువులు తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకోవడమే కాకుండా, భూగర్భ జలమట్టం పెరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## మాత వాసవి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): మాత వాసవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా హయత్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతీక అయిన మాత వాసవి దేవి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజహితాన్ని కాంక్షిస్తూ మాత వాసవి చేసిన ఆత్మార్పణ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, నైతిక విలువలను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సంఘ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గోడౌన్ మార్చాలని రేషన్ డీలర్ల ఆవేదన

* జిల్లా మేనేజర్ ను కలిసి మాట్లాడిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, ఫిబ్రవరి 02 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ని రేషన్ డీలర్ల పలు సమస్యల మీద సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని సర్కిల్ 3లో దాదాపు 105 రేషన్ డీలర్ల షాపులు ఉన్న నేపథ్యంలో ప్రతి నెల కొంగరకలన్ లో గల పౌరసరఫరాల గోడౌన్ కు ప్రతీ ఒక్క డీలర్ వచ్చి వేలి ముద్రలు వేస్తున్న సందర్భంగా వారు పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్ నుంచి కొంగరకలన్ రావడానికి సరి అయిన రవాణా వ్యవస్థ లేదని, దాదాపు 35 కిలోమీటర్ల దూరం ఉందని, అలాగే డీలర్లలో కొందరు వికలాంగులు,మహిళలు ఉండడం వల్ల వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, నెలలో దాదాపు మూడుసార్లు ఇక్కడికి రావాల్సి వస్తుందని అన్నారు.సరి అయిన సమయంలో బియ్యం రావడం లేదని,ఇక్కడ సరి అయిన వసతులు లేవని అన్నారు.ఈ సమస్యలకు ప్రత్యామ్నాయంగా బడంగ్పేట్ వద్ద ఉన్న గోడౌన్ తరలిస్తే ప్రతి ఒక్క డీలర్లకు ఉపయెగం ఉంటుందని అన్నారు. దానికి స్పందించిన వారు అధికారులతో చర్చించి తప్పకుండా బడంగ్పేట్ గోడౌన్ కు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,చెన్నగొని శ్రీధర్ గౌడ్, చిరంజీవి,మహేష్ రెడ్డి, సందీప్, యాదయ్య,ఇంద్రకరణ్ రెడ్డి పలువురు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కాలనీ అభివృద్ధి విషయంలో నా సహాయ సహకారాలు ఎల్లప్పడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లగ్గోని శ్రీధర్ గౌడ్,అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి,ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి,రాజగోపాల్ రావు, కార్యదర్శి యువీఎస్ బాబు, సంయుక్త కార్యదర్శి రవికాంత్, నర్సింహారెడ్డి,ట్రెజరర్ అంజయ్య యాదవ్, కమిటీ సభ్యులు ఆశీర్వాదం,ఝాన్సీ లక్ష్మీబాయి, సుకృత,కరుణాకర్,అజయ్ కుమార్,మహిపాల్ రెడ్డి,రవీంద్ర రెడ్డి,నర్సింహా,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, ఫిబ్రవరి 02 (భారత శక్తి ):

# "మహిళల భద్రతే మా ప్రాధాన్యత"

* మల్కాజ్‌గిరి కమిషనరేట్ మహిళా భద్రత డీసీపీ శ్రీమతి టి. ఉషారాణి




ఎల్బీనగర్, ఫిబ్రవరి 02 (భారత శక్తి): మల్కాజ్‌గిరి కమిషనరేట్ మహిళా భద్రత డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉషారాణి మాట్లాడుతూ, బాలికలను, మహిళలను వేధించే ఎవరినీ పోలీసులు వదిలిపెట్టరని, మహిళలు భయం లేకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, కూరగాయల మార్కెట్‌లు ఇతర బహిరంగ ప్రదేశాలలో షీ టీమ్‌లు సాధారణ దుస్తులలో మోసపూరిత ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయని ఆమె తెలియజేశారు. మహిళలను వేధించే వ్యక్తులను సరైన ఆధారాలతో పట్టుకుని, కోర్టుల ముందు హాజరుపరుస్తున్నారు. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ అందిస్తున్నారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్‌లోని మహిళా భద్రత డీసీపీ పర్యవేక్షణలో,ఎల్బీ నగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీస్‌లో ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్ సెషన్‌లు నిర్వహించారు. ఈ కాలంలో, మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడిన మొత్తం 81 మంది నేరస్థులను (64 మంది మేజర్లు 17 మంది మైనర్లు) షీటీమ్స్ అరెస్టు చేశాయి. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీస్‌లో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో, ప్రొఫెషనల్ కౌన్సెలర్ల సహాయంతో కౌన్సెలింగ్ అందించబడింది. ఇంకా, ఈ నెల 1 నుండి 15 వరకు మొత్తం 97 ఫిర్యాదులు అందాయి.

**ఫిర్యాదుల స్వభావం:**

* ఫోన్ కాల్స్ ద్వారా వేధింపులు 17
* సోషల్ మీడియా అప్లికేషన్ల ద్వారా వేధింపులు 36
* ప్రత్యక్ష/శారీరక వేధింపులు 44

తీసుకున్న చర్యలు:

* 9 క్రిమినల్ కేసులు నమోదు చేయబడ్డాయి.
* 29 చిన్న చిన్న కేసులు నమోదు చేయబడ్డాయి.
* 52 మందికి కౌన్సెలింగ్ అందించబడింది.

**ముఖ్యమైన కేసులు:**

స్త్రీని వేధించడం, వ్యక్తిగత ఫోటోలను అప్‌లోడ్ చేస్తామని బెదిరించారు:

షీ టీం అందుకున్న ఫిర్యాదు ఆధారంగా, ఒక యువతి తన సహోద్యోగి పదేపదే తనతో సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి తెచ్చారని ఫిర్యాదు చేసింది. తరువాత, అతను మరో మహిళతో కూడా సంబంధం కలిగి ఉన్నాడని ఆమెకు తెలిసింది, ఇది వివాదాలకు దారి తీసింది. వారు జూన్ 2024లో విడిపోయారు. ఆ తర్వాత, ఇద్దరూ వేర్వేరు కంపెనీలలో చేరారు. సుమారు మూడు నెలల క్రితం, నిందితుడు ఫిర్యాదుదారు ప్రస్తుతం పని చేస్తున్న కార్యాలయంలో చేరాడు. ఆమెను వివాహం చేసుకోవాలని బలవంతం చేయడం ప్రారంభించాడు. ఆమె నిరాకరించడంతో, ఆమెను బ్లాక్ మెయిల్ చేయడానికి, వేధించడానికి ఆమె వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. షీ టీమ్ వెంటనే చర్య తీసుకుంది, పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

* **రోడ్డుపై నడుచుకుంటూ వెలుతుండగా మహిళను వేధించారు:**

షీ టీమ్‌కు అందిన ఫిర్యాదు ఆధారంగా, ఒక ప్రైవేట్ కంపెనీలో విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి రోడ్డుపై తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఒక మహిళ ఫిర్యాదు చేసింది. నేరస్థులు ఆమె చెవిపై కొట్టి వెంటనే అక్కడి నుండి పారిపోయారు. షీ టీమ్ వెంటనే స్పందించి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది.

* **కాలేజీ విద్యార్థినిని వేధించిన వ్యక్తిపై కేసు నమోదు:**

షీ టీంకు అందిన ఫిర్యాదు ఆధారంగా, ఒక కళాశాల విద్యార్థి తండ్రి తన కుమార్తె కళాశాలకు వెళ్లేటప్పుడు నిరంతర వేధింపులను ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ చదువుతోంది. ఉదయం వేళల్లో బస్ స్టాప్ నుండి ప్రతిరోజూ ఆమె కళాశాల బస్సు ఎక్కుతుంది.గత కొన్ని నెలలుగా, గుర్తు తెలియని మధ్య వయస్కుడైన వ్యక్తి క్రమం తప్పకుండా బస్టాప్‌కు వచ్చి విద్యార్థిణిని అనుసరిస్తున్నాడు. అతను ఆమెను అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం, అనుచిత పదాలను ఉపయోగించడం ద్వారా వేధించాడు, దీని వలన తీవ్ర భయం, మానసిక ఒత్తిడి ఆందోళన ఏర్పడింది. షీ టీం వెంటనే చర్య తీసుకుంది, పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది. నిందితుడిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించింది.

* **ఒక యువతిని వేధించినందుకు పెట్టీ కేసు నమోదు చేయబడింది:**

షీ టీంకు అందిన ఫిర్యాదు ఆధారంగా, ఒక యువతి గుర్తు తెలియని వ్యక్తి తనను నిరంతరం వెంబడిస్తున్నాడని, భయం ఆందోళన కలిగిస్తున్నాడని నివేదించింది. ఆమె సహాయం కోసం షీ టీంను సంప్రదించింది. నేరస్థులను పట్టుకోవడానికి షీ టీం వెంటనే పాఠశాల ప్రాంతంతో సహా కీలక ప్రదేశాలలో మోసపూరిత ఆపరేషన్ నిర్వహించింది. ప్రతివాదులను గుర్తించి అరెస్టు చేశారు. దీని ప్రకారం, సంబంధిత విభాగాల కింద పోలీస్ స్టేషన్‌లో ఈపెట్టీ కేసు నమోదు చేయబడింది.

**అవగాహన కార్యక్రమాలు:**

ఈ నెలలో 2026 జనవరి 1 నుండి 15 వరకు, మల్కాజ్‌గిరి షీ టీమ్స్ 36 అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, మహిళలకు సంబంధించిన చట్టాలు, హక్కులు, నేరాలు భద్రతా జాగ్రత్తలపై సుమారు 4,566 మందికి అవగాహన కల్పించాయి.

**మెట్రో రైలు డెకాయ్ ఆపరేషన్లు:**

మెట్రో రైళ్లలో నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్లలో, మహిళలు మాత్రమే ఉండే కంపార్ట్‌మెంట్లలో ముగ్గురు పురుషులు ప్రయాణిస్తున్నట్లు కనుగొనబడింది. వారికి మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా జరిమానాలు విధించబడ్డాయి. వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలు వెంటనే మల్కాజ్‌గిరి వాట్సాప్ నంబర్: 8712662111 లేదా సంబంధిత ప్రాంతం షీటీమ్ నంబర్ల ద్వారా షీటీమ్‌లను సంప్రదించాలని సూచించారు:

* బేగంపేట - 8712665300
* జవహర్‌నగర్ - 8712662601
* ఎల్బీనగర్ - 8712662602
* మల్కాజ్‌గిరి - 8712662603
* మేడిపల్లి - 8712662600
* వనస్థలిపురం - 8712662604
* ఉప్పల్ - 8712665299

మహిళలు భయం లేకుండా సంఘటనలను నివేదించమని ప్రోత్సహించబడ్డారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ షీటీమ్స్ పి. వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఎం. ముని, అడ్మిన్ ఎసై రాజు, షీటీమ్ సిబ్బంది, కౌన్సెలర్లు పాల్గొన్నారు.



## దేవాలయం భూముల పేరుతో పేదలను ఆగం చేయొద్దు : ఎంపీ ఈటెల రాజేందర్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 02 (భారత శక్తి): కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం పరిసర భూములలో 35 ఏళ్ల క్రితం సర్వే నెంబర్ 110 లో సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి వేసిన వెంచర్ లే ఔట్ లో ఆనాడు కట్టుకున్న ఇళ్లను సోమవారం తెల్లవారుజామున దేవాదయ శాఖ భూములని అంటూ 20 ఇండ్లను, 30 కుటుంబాలను దౌర్జన్యంగా సామాన్లు బయట వేసి ఎల్లగొట్టడం సమంజసం కాదని, ఒక వేళ ఇది ఎండోన్ మెంట్ భూమి ఐతే ఇన్నాళ్లు అధికారులు ఏం చేశారని, ఇండ్ల కట్టుకోవడానికి పర్మిషన్ ఎలా ఇచ్చారని, ట్యాక్స్ వసూళ్లు చేసారు కదా అని ప్రశ్నించారు. మేం దేవాలయం భూముల ఆక్రమణలను సమర్థించడం లేదు కానీ 35 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లను,ఖాళీ చేయించడం, పేదలను రోడ్ల మీద వేయడం దుర్మార్గపు చర్య అని ఎంపీ ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్త పరిచారు.

# హయత్‌నగర్ అభివృద్ధికి నవజీవన్ రెడ్డి అలుపెరుగని కృషి

* మురుగునీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు,
* రూ. 63.50 లక్షలతో పలు కాలనీల్లో సీసీ రోడ్ల పనులు.
* క్షేత్రస్థాయిలో పర్యటించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.

హయత్‌నగర్, ఫిబ్రవరి 2 (భారత శక్తి): హయత్‌నగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి, అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు సమస్యలను స్వయంగా పరిశీలించారు.

* **మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం.**

సూర్యనగర్ కాలనీలో చాలా కాలంగా పెండింగ్‌లో



ఉన్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ ఎక్స్‌టెన్షన్ సమస్యను జలమండలి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిధుల మంజూరుకు ఉన్నతాధికారులతో చర్చించి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

* **ముమ్మరంగా సీసీ రోడ్ల పనులు:**

డివిజన్ వ్యాప్తంగా రూ. 63.50 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. సాయిబాబా కాలనీ: రూ. 42.50 లక్షలతో చేపట్టిన నూతన సీసీ రోడ్ల పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

* **రంగనాయకుల గుట్ట:**

రూ. 21 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి అధికారులతో కలిసి లెవెల్స్‌ను పరిశీలించారు. మరో రెండు రోజుల్లో ఈ పనులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.

* **పదవీకాలం ముగిసే వరకు ప్రజల సేవలోనే..**

గత ఐదేళ్లుగా డివిజన్ అభివృద్ధియే ధ్యేయంగా పని చేస్తున్నామని, పదవీకాలం చివరి దశకు వచ్చినప్పటికీ ప్రతి పనిని పర్యవేక్షిస్తూ ప్రజల మధ్యే ఉంటానని నవజీవన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు గంగాన శ్రీనివాస్, జలమండలి మేనేజర్ రాజు, కాలనీ



సంక్షేమ సంఘాల ప్రతినిధులు బత్తు రవి, మహేందర్, భాస్కర్, కుమార్‌తో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.



## 33 వ వార్డు బిజెపి బీఫామ్ అందుకున్న అభ్యర్థి నిర్మల

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 2(భారత శక్తి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని 33 వార్డుల బీజేపీ అభ్యర్థుకి బీ-ఫారమ్‌లను బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ డి. నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా బీజేపీ అభ్యర్థి నిర్మల కి తన చేతుల మీదుగా బీ-ఫారమ్‌ను అందజేశారూ. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ముందుకు సాగుతుందని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

## నకిలీ ఎంఓయూలతో యువతకు వంచన!

* కాంగ్రెస్ ప్రభుత్వంపై కప్పాటి పాండురంగా రెడ్డి ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 ఫిబ్రవరి 2(భారత శక్తి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉనికిలో లేని, నకిలీ కంపెనీలతో బూటకపు ఒప్పందాలు (MoU) కుదుర్చుకుంటూ తెలంగాణ యువతను నిలువునా వంచిస్తోందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న లక్షల కోట్ల పెట్టుబడులన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.

**అడ్రస్ లేని సంస్థలతో ఒప్పందాలా?**

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని






ప్రచారం చేసుకోవడం కోసం, ఉనికిలో లేని సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడం సిగ్గుచేటని పాండురంగా రెడ్డి మండిపడ్డారు. "అమెరికా పర్యటనలో రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతుందన్న 'స్వచ్ బయో' కంపెనీ, ఒప్పందానికి కేవలం రెండు వారాల ముందే పుట్టిందన్న విషయం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన ఎద్దేవా చేశారు. అడ్రస్ లేని కంపెనీలతో ఫోటోలకు ఫోజులివ్వడం తప్ప, క్షేత్రస్థాయిలో యువతకు లభించిన ఉపాధి సున్నా అని విమర్శించారు.

**నిజాయితీగా సమాధానం చెప్పాలి:**

నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాస్తవదూరమైన ప్రకటనలతో మరోసారి మోసగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దొంగ ఒప్పందాల వెనుక ఉన్న అసలు వాస్తవాలను బయటపెట్టాలని, ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి, ఇప్పటికైనా చిత్తశుద్ధితో కూడిన పాలన అందించాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

## ఒక్క అవకాశం ఇయ్యండి అభివృద్ధి చేసి చూపిస్తా

* 9వ వార్డు బిజెపి అభ్యర్థి మమతా రాము....

వనపర్తి జిల్లా ప్రతినిధి , ఫిబ్రవరి 2 (భారత శక్తి) : భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి మమతా రాము 9వ వార్డ్ నుండి మునిసిపల్ ఎన్నికలలో కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు ఈ సందర్భంగా మమతా రాము మాట్లాడుతూ 9వ వార్డ్ ప్రజలు ఓటర్ మహాశయులు ఒక్క అవకాశం ఇచ్చి కౌన్సిలర్ గా నన్ను గెలిపిస్తే వార్డ్ ను అభివృద్ధి చేసి చూపిస్తానని గతంలో ఉన్న పాలకులు ఎంతవరకు అభివృద్ధి చేశారని కనీసం మురికి కాల్వలు డ్రైనేజీలు సిసి రోడ్లు మంచినీటి సౌకర్యాలు అవకాశం ఉన్న పరిష్కరించలేకపోయారు వార్డ్ లో అనేక సమస్యలు ఉన్నాయి కేంద్రం నుండి నిధులు



తీసుకువచి అయిన వీటన్నిటిని తనను గెలిపిస్తే పరిష్కరిస్తానని అందుకు తొమ్మిదో వార్డ్ ప్రజలు ఆలోచించి ఈసారి బిజెపి పార్టీకి మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## దత్తాత్రేయ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్‌లోని దత్తాత్రేయ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు గత ఐదు సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తూ నిరంతరం కృషి చేస్తున్న కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కాలనీలో కొంతమేర భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ కొరత ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.దీనికి స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ భూగర్భ డ్రైనేజ్, మంచినీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. తమ పదవీ కాలంలోనే దత్తాత్రేయ కాలనీలో మిగిలి ఉన్న కొద్దిపాటి భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ధర్నాలో ప్రభుత్వ ఉపాధ్యాయుల 'ప్రసంగ' హోరు!

* ప్రభుత్వ జీతం పార్టీకి సేవ,
* బడుగు వర్గాల పిల్లల చదువులు నిర్లక్ష్యం
* నిబంధనలకు తిలోదకాలిచ్చి రాజకీయ వేదికపైకి..
* చర్చనీయాంశంగా 'తపస్' నేతల తీరు; చర్యలకు రంగం సిద్ధం?
* సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ ఉల్లంఘనపై విద్యాశాఖకు ఫిర్యాదు చేసిన , కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక,

**రాజ్యాంగం కల్పించిన హోదాను రాజకీయాలకు తాకట్టు పెట్టడం అంటే, అక్షరాలను అంగట్లో అమ్మకానికి పెట్టడమే. బడి గంట మోగాల్సిన వేళ, పార్టీ జెండా పట్టుకుని పరవశించిపోవడం ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చ. చట్టం ఏం చెబుతుందో తెలియని అజ్ఞానులు కారు వీరు; తెలిసి కూడా 'కండక్ట్ రూల్స్'ను కాలరాస్తున్న చదువుల సార్లు. వీరు పాఠాలు చెప్పేది పేద బిడ్డలకా? లేక పార్టీ సిద్ధాంతాలకా?**

హైదరాబాద్, ఫిబ్రవరి 2(భారత శక్తి): ప్రభుత్వ నిబంధనలు గాలికి ఎగిరిపోయాయి.. రాజకీయ తటస్థత పాతాళానికి పడిపోయింది. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయ పార్టీ వేదికపై గొంతు చించుకోవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జనవరి 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ సాక్షిగా జరిగిన ఓ రాజకీయ ధర్నా, ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రవర్తనా నియమావళి పై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది.

**రాజకీయ వేదికపై ప్రభుత్వ 'భేరీ'**

పెండింగ్ బిల్లుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో.. తపస్ (TAPAS) రాష్ట్ర అధ్యక్షుడు హొదనాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కానుగంటి హనుమంతరావు తదితరులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కేవలం హాజరు




కావడమే కాకుండా, సదరు రాజకీయ పార్టీ నాయకులతో కలిసి వేదికను పంచుకోవడమే కాకుండా, మైక్ పట్టుకుని ప్రసంగించడం ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువైంది.

**రూల్ 5 ఏం చెబుతోంది?**

తెలంగాణ సివిల్ సర్వీసెస్ (కండక్ట్) రూల్స్, 1964 ప్రకారం.. ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా ఏ రాజకీయ పార్టీకి సభ్యత్వం తీసుకోకూడదు, వారి కార్యక్రమాల్లో పాల్గొనకూడదు.

ముఖ్యంగా బహిరంగ వేదికలపై రాజకీయ అనుబంధాన్ని ప్రదర్శించడం తీవ్రమైన అపరాధంగా పరిగణించబడుతుంది. 1991 CCA నిబంధనల ప్రకారం ఇది స్పష్టమైన 'అనుచిత ప్రవర్తన' కిందకు వస్తుంది.




**సీఎస్, విద్యాశాఖకు ఫిర్యాదులు:**

ప్రభుత్వ జీతం తీసుకుంటూ, ఒక పార్టీకి వత్తాసు పలకడంపై ఇతర ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (CS), విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు అధికారికంగా ఫిర్యాదులు అందాయి.

**ప్రధాన డిమాండ్లు:**

నిబంధనలు ఉల్లంఘించిన నేతలపై తక్షణమే శాఖాపరమైన విచారణ చేపట్టాలి. బాధ్యులను తక్షణమే సస్పెండ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి. వ్యవస్థలో రాజకీయ జోక్యాన్ని నియంత్రించి, పరిపాలనా విలువలను కాపాడాలి. మౌనం వహిస్తే ముప్పే 100 పైగా సంఘాలు ఏర్పాటు చేసుకొని పేద బడుగు బలహీన వర్గాల పిల్లల చదువును నిర్లక్ష్యం చేసున్న ఉపాధ్యాయ సంఘాల నేతలను రాజకీయాలకు దూరంగా ఉంచాలి అప్పుడే ప్రభుత్వ విద్య బతికి బట్ట కడుతుంది, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా బహిరంగంగా రాజకీయ బావుటా పట్టుకుంటే, భవిష్యత్తులో పరిపాలనా యంత్రాంగం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో, విద్యాశాఖ ఎలాంటి కొరడా ఝుళిపిస్తుందో వేచి చూడాలి.

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు

అమరావతి,ఫిబ్రవరి 2(భారతశక్తి): రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని.. అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైకాపా పుట్టింది. ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదని చంద్రబాబు అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని ఛీదరించుకుంటున్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైకాపా కుట్ర. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా. అది వైకాపా నేతలకు నచ్చడం లేదు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతాం. తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలి. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైకాపా ట్రాప్‌లో పడొద్దు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు, శాంతిభద్రతల అంశం, పాలనలో మార్పులు వంటి విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తాజా ట్వీట్ చర్చకు దారితీసింది. వైసీపీపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేక వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతమని, వారి పాలనలో చట్టవిరుద్ధ పాలనకు అనేక ఉదాహరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జగన్ హయాంలో చట్టాన్ని పక్కనపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అనేక అక్రమాలు, చట్టవిరుద్ధ చర్యలే దీనికి నిదర్శనమని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ జగన్ పాలన కొనసాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో రూల్ ఆఫ్ లా గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2024 తర్వాతే రాష్ట్రంలో నిజమైన చట్టపాలన అమలవుతోందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో చట్టం పేరుకే ఉండేదని అధికారమే అన్నింటికీ ఆధారంగా మారిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం అందాలంటే రాజ్యాంగమే సుప్రీమ్‌గా ఉండాలని, అదే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని, అది ఏ పార్టీకి చెందిన వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని చంద్రబాబు అభివర్ణించారు. గతంలో క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితిని పునరుద్ధరించామన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఉద్ఘాటించారు. శాంతిభద్రతలను ఉల్లంఘించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పునర్నిర్మాణ ప్రక్రియను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీఎం విమర్శించారు. వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను మళ్లీ నిర్మిస్తున్న తీరును చూసి అసహనంతో దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారిత కల్పించడమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయటం, వారికి సాధికారిత కల్పించటమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని తెలిపారు. పాలనలో పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పాలన తమ లక్ష్యాలని స్పష్టం చేశారు. వైసీపీ నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతోనే ఆ పార్టీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో
# పులి సంచారం కలకలం

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 2 (భారతశక్తి): రాజమహేంద్రవరం మండలంలోని తొర్రేడులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన రెండు ఆవులు, దూడ కళేబరాలను వారు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు తొర్రేడు తోటల్లో పులిబోను, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు డీఈవో సోమవారం సెలవు ప్రకటించారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రజల్ని, పర్యాటకుల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంచారం కలకలం రేపుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పులుల సంచారం ఎక్కువైపోయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చిన పులులు అలజడి సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. నిన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే పులి కనిపించింది. పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

## అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి
# వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా

హైదరాబాద్,ఫిబ్రవరి 2 (భారతశక్తి): తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించిందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆరఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కవిత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,ఫిబ్రవరి 2 (భారతశక్తి): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2 (భారతశక్తి): కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది. సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫఐఆర్లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన పోస్టుల వలన మనోభావాలు దెబ్బతిన్నాయి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది అంటూ అసత్యపు పునాదుల పైన అక్రమ కేసులు ఇప్పటిదాకా పెట్టిన ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. హైకోర్టు తన తీర్పులో ఇచ్చిన మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. పోలీసులు ఎఫఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారుడు స్వయంగా బాధితుడా కాదా అనేది నిర్ధారించుకోవాలి, మూడవ పక్షం చేసే ఫిర్యాదులు పరువు నష్టం కేసులలో చెల్లవు. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫఐఆర్ నమోదు చేయకూడదు. అంతేకాకుండా, కేవలం రాజకీయ విమర్శలు లేదా కఠినమైన వ్యాఖ్యలను నేరంగా పరిగణించకూడదు. హింసను ప్రేరేపిస్తేనే అలాంటి కేసులు నమోదు చేయాలి. పరువు నష్టం అనేది నాన్`కాగ్నిజబుల్ నేరం కాబట్టి, నేరుగా ఎఫఐఆర్ నమోదు చేయకుండా, ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్‌ను సంప్రదించాలని హైకోర్టు సూచించింది. చివరగా, పోలీసులు అరెస్టు చేసేటప్పుడు ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, రాజకీయ ప్రేరేపితమైన లేదా నిరాధారమైన ఫిర్యాదులను తిరస్కరించాలని ఆదేశించింది.

## ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో,
# నాడు కేసీఆర్‌కు అలాగే వచ్చింది: కేటీఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి 2 (భారతశక్తి): ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని, ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్ ప్రభుత్వానికి కూడా అలాగే వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ నిన్న రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కదిలారని అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకువస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని, మేడారం జాతర ఏర్పాట్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వారు చెబుతున్న అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయని అన్నారు. మొదట వ్యాపారవేత్తలు, ఆ తర్వాత సినిమా తారల ఫోన్లు ట్యాప్ చేశారని చెప్పారని, ఇప్పుడు ఏమీ లేదని అంటున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ తమకు లేదని స్వయంగా కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇకనైనా పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సజ్జనార్ తీర్పు చెప్పడానికి ఆయన జడ్జి కాదని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వచ్చిన అభియోగాలపై కోర్టులు తేల్చుతాయని అన్నారు. హైదరాబాద్ నగరంలో పట్టపగలు కాల్పులు, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. సింగరేణి కుంభకోణం అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కి పోతున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిలదీస్తోందని, అందుకే సిట్‌ల పేరిట విచారణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. పైశాచిక ఆనందం కోసం కేసీఆర్‌ను అంతసేపు విచారణ పేరుతో కూర్చోబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ పెదవి విరిచారు. ఉపాధి హామీని కుదించారని, ఎరువులు, ఆహార రాయితీ, స్వచ్ఛ భారత్ నిధులు తగ్గించారని ఆరోపించారు. బయో ఫార్మా తయారీకి రూ.10 వేల కోట్లు కేటాయించిన కేంద్రం హైదరాబాద్‌కు రూ.10 కూడా కేటాయించలేదని విమర్శించారు. ఢిల్లీకి 60 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిందేమిటని ప్రశ్నించారు. రెండు పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు.

## ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..
## బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు

అమరావతి ,ఫిబ్రవరి 2 (భారతశక్తి): హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

# ఇండియా గేట్ ఫొటో షేర్ చేసిన ట్రంప్...
## 'ట్రూత్ సోషల్'లో ఆసక్తికర వ్యాఖ్యలు

అమెరికా, ఫిబ్రవరి 2: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, న్యూఢిల్లీలోని ప్రఖ్యాత ఇండియా గేట్ చిత్రాన్ని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. భారత చారిత్రక కట్టడాన్ని ప్రశంసిస్తూనే, "భారతదేశం యొక్క అందమైన విజయ స్తంభం, మాది అందరికంటే గొప్పదిగా ఉంటుంది" అని తనదైన శైలిలో ఓ వ్యాఖ్యను జోడించారు. సోమవారం చేసిన ఈ పోస్ట్ వెనుక ఓ పెద్ద ప్రణాళిక ఉన్నట్లు స్పష్టమవుతోంది. అమెరికా స్వాతంత్ర్యం సిద్ధించి 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వాషింగ్టన్ డీసీలో ఓ భారీ విజయ ద్వారం నిర్మించాలనేది ట్రంప్ ప్రతిపాదన. 'ఇండిపెండెన్స్ ఆర్చ్'గా పిలుస్తున్న ఈ నిర్మాణంతో తన ప్రణాళికను మరోసారి ఆయన తెరపైకి తెచ్చారు. "250 ఏళ్ల స్వాతంత్ర్యానికి గుర్తుగా 250 అడుగుల ఎత్తు" అనే నినాదంతో దీన్ని నిర్మించాలని ఆయన భావిస్తున్నారు. ఈ ఆర్చ్ పూర్తయితే, అమెరికా రాజధానిలోని వైట్ హౌస్ (70 అడుగులు), లింకన్ మెమోరియల్ (100 అడుగులు) కంటే ఎంతో ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోని ప్రఖ్యాత కట్టడాలతో పోలుస్తూ, పారిస్‌లోని ఆర్క్ డి ట్రయంఫ్ (164 అడుగులు), మెక్సికో సిటీలోని ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్చ్ (220 అడుగులు) కన్నా కూడా తన ఆర్చ్ పెద్దదిగా ఉండాలని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, ఇండియా గేట్ ఎత్తు 138 అడుగులు. మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల స్మారకార్థం దీన్ని నిర్మించారు. అయితే, ట్రంప్ ప్రతిపాదిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుకు ఇంకా అధికారిక డిజైన్లు ఖరారు కాలేదని, నిర్మాణ అనుమతులు కూడా లభించలేదని తెలుస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం కార్యరూపం దాల్చడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.



# చట్టం కోవెలలో.. చీకటి నీడలా?

హైదరాబాద్, జనవరి 31 (భారత శక్తి): న్యాయం కోసం సామాన్యుడు తలదాచుకునే పవిత్ర దేవాలయం కోర్టు. ఆ కోవెలలో ధర్మం వైపు నిలబడాల్సిన వారే.. తమ నేపథ్యం విషయంలో 'ముసుగు' వేస్తే ఎలా? సమాజానికి నీతులు చెప్పే మేధావుల ఎన్నికల్లో పారదర్శకతకు పాతర వేయడమేమిటి? ఎంపీలు, ఎమ్మెల్యేలే తమ నేర చరిత్రను దేశం ముందు పెడుతున్నప్పుడు, చట్టం తెలిసిన మేధావులు తమ అఫిడవిట్లను ఓటర్ల ముందుకు ఉంచడానికి అభ్యంతరం ఏమిటి? ఇప్పుడు ఇవే ప్రశ్నలు తెలంగాణ న్యాయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి.

*** వెలుగు చూడని వివరాలు.. ప్రశ్నిస్తున్న ఓటరు!**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యత్వానికి సంబంధించి శుక్రవారం జరిగిన ఎన్నికలు వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. 25 స్థానాల కోసం 209 మంది న్యాయవాదులు బరిలో నిలవగా, వారిలో ఎవరికి నేర చరిత్ర ఉంది? ఎవరిపై క్రమశిక్షణా చర్యలు పెండింగ్‌లో ఉన్నాయి? అన్న విషయాలను బార్ కౌన్సిల్ బయటపెట్టకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఓటరుకు తన అభ్యర్థి గురించి తెలుసుకునే కనీస హక్కును కాలరాస్తున్నారంటూ హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్ (W.P. No. 2899 of 2026) ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

*** సుప్రీం తీర్పుకు తూట్లు పొడిచినట్టేనా?**

2002లో 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును పిటిషనర్ బి. సుభాష్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

*** రాజ్యాంగం ఏం చెబుతోంది?: అధికరణలు 14, 19(1)(a), మరియు 21 ప్రకారం సమాచారం తెలుసుకోవడం ఓటరు ప్రాథమిక హక్కు.**

అధికారిక వెబ్‌సైట్ ఎందుకు మౌనంగా ఉంది?: సాధారణ ఎన్నికల్లో అఫిడవిట్లు ఆన్‌లైన్‌లో ఉంచినట్లే, బార్ కౌన్సిల్ అభ్యర్థుల వివరాలు ఎందుకు సామాన్యుడికి అందుబాటులో లేవు?

*** మౌనం దేనికి సంకేతం?: జనవరి 28నే వినతిపత్రం ఇచ్చినా బార్ కౌన్సిల్ స్పందించకపోవడం వెనుక అర్థమేమిటి?**

"దేశ ప్రధాని సైతం తన వ్యక్తిగత, నేర చరిత్ర వివరాలను అఫిడవిట్ రూపంలో వెల్లడిస్తున్నప్పుడు.. చట్టం చదువుకున్న న్యాయవాదులకు ఈ గోప్యత ఎందుకు?" అని పిటిషనర్ సంధించిన ప్రశ్న అటు న్యాయవాదులను, ఇటు ప్రజలను ఆలోచింపజేస్తోంది.

*** వృత్తి ధర్మమా.. ముసుగు రాజకీయామా?**

న్యాయవాద వృత్తిలో 'నీతి' అనేది అత్యున్నత శిఖరం. అటువంటి వృత్తిని పర్యవేక్షించే బార్ కౌన్సిల్ లోకి అడుగుపెట్టే వారు నిష్కళంకమైన నేపథ్యం కలిగి ఉండాలి. కానీ, వివరాలను బహిర్గతం చేయకపోవడం వల్ల అభ్యర్థుల నిజస్వరూపం ఓటరుకు తెలియడం లేదు. అంధకారంలో ఓటు వేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

*** కోర్టులో 'మాండమస్' విన్నపం:**

తక్షణం జోక్యం చేసుకుని, పోటీ చేసిన 209 మంది అభ్యర్థుల పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచేలా బార్ కౌన్సిల్‌ను ఆదేశించాలని పిటిషనర్ కోరారు. చట్టం ముందు అందరూ సమానమేనని చాటిచెప్పేలా ఈ కేసు విచారణ జరగాలని న్యాయవాద లోకం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ పోరు కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాదు.. న్యాయవాద వృత్తిలోని నైతిక విలువలను కాపాడటం కోసమని పిటిషనర్ స్పష్టం చేశారు.

## కొత్తపేట సిగ్నల్ కాడ 'హరిత'మ్మ సత్తా..

# తన డ్యూటీతోనే సిటీకి చుక్కాని!

### హెవీ ట్రాఫిక్‌ను ఒంటిచేత్తో చక్కదిద్దుతున్న మహిళా కానిస్టేబుల్.. సూపర్ ఉమెన్ అంటూ ప్రశంసల జల్లు

హైదరాబాద్ కొత్తపేట ప్రతినిధి , ఫిబ్రవరి 2 (భారత శక్తి): భారత శక్తి, ఆ రోడ్డు మీద ఇటు చూస్తే విజయవాడ పోయే భారీ వాహనాలు.. అటు చూస్తే దిల్సుఖ్‌నగర్ వైపు నుంచి వచ్చే కార్లు, బైకులు.. ఇంకోవైపు సరూర్‌నగర్ వెళ్లే గల్లీ జనం.. ఈ రద్దీని చూస్తేనే ఎవరికైనా పిచ్చెక్కిపోతది. కానీ, అక్కడ ఆ ట్రాఫిక్ గందరగోళాన్ని చిటికెలో చక్కదిద్దుతూ, తన సైగలతో వాహనాలను దారిలో పెడుతున్న ఒక మహిళా కానిస్టేబుల్ ఇప్పుడు అందరి నోటా 'సూపర్ ఉమెన్' అని పిలిపించుకుంటోంది. ఆమె పేరే హరిత.

*** నాలుగు దార్ల నడమ.. హరితమ్మ సైగ:**

కొత్తపేట కూడలి అంటేనే ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం. భారీ వాహనాలు, బస్సులు, ఆటోలతో ఆ జంక్షన్ ఎప్పుడూ కిక్కిరిసి ఉంటుంది. కానీ హరిత గారు అక్కడ డ్యూటీలో ఉన్నారంటే చాలు.. ట్రాఫిక్ నదిలా సాగిపోవాల్సిందే.



**క్రమశిక్షణ:**

ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా వాహనాలను నియంత్రిస్తున్నారు.

చురుకుదనం: ఎండైనా, వానైనా వెనకడుగు వేయకుండా, చౌరస్తా మధ్యలో నిలబడి నాలుగు వైపుల వాహనాలను గమనిస్తూ సమయ స్ఫూర్తితో సిగ్నల్స్ ఇస్తున్నారు.

**ఒంటి చేత్తో కంట్రోల్..**

ఒకవైపు హెవీ వెహికల్స్ దూసుకొస్తున్నా, మరోవైపు సిటీ జనం తొందరపడుతున్నా.. ఆవేశపడకుండా తనదైన శైలిలో వాహనాలను ఆపుతూ, మళ్లీ క్లియర్ చేస్తూ ఆమె చేస్తున్న పనితీరు వాహనదారులను ఆకట్టుకుంటోంది. "ఒక ఆడబిడ్డ ఇంత కష్టమైన ట్రాఫిక్‌ను ఇంత కూల్‌గా ఎట్లా మేనేజ్ చేస్తోంది?" అని అటుగా వెళ్లే జనం ఆశ్చర్యంగా చూస్తున్నారు.





**ఆమె పనితీరు భేష్..**

కేవలం చేతులు ఊపడమే కాదు, వాహనాల రాకపోకల తీవ్రతను బట్టి ఏ వైపు వాహనాలను ఎంతసేపు ఆపాలి, ఎటువైపు పంపితే రద్దీ తగ్గుతుందనేది సరిగ్గా అంచనా వేసి పని చేయడం ఆమె ప్రత్యేకత. పీక్ అవర్స్ లో కూడా ట్రాఫిక్ జామ్ కాకుండా చూడటంలో ఆమె చూపుతున్న నేర్పు ప్రశంసనీయం. "డ్యూటీ అంటే కేవలం రోడ్డు మీద నిలబడటం కాదు.. జనం సురక్షితంగా ఇళ్లకు చేరేలా చూడటం" అని హరిత గారు నిరూపిస్తున్నారు. ఆమె చూపిస్తున్న ఈ తెగువ, బాధ్యత ఇతర పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తోంది.





## మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల్లో ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే మెగా రెడ్డి

వనపర్తి జిల్లా భారత శక్తి ప్రతినిధి. ఫిబ్రవరి 2: వనపర్తి పట్టణంలోని 13, 14, 17 వార్డులలో మార్నింగ్ వాక్ చేపట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి.ఈ సందర్భంగా వార్డుల్లోకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, తిలకం దిద్దుతూ, మంగళ హారతులు ఇస్తూ, డప్పు వాయిద్యాల మధ్యన, పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలోకి వచ్చాక వనపర్తి పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన లాంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టి నిరుపేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు.

## "న్యాయం గెలిచినా దక్కని హాల్ టికెట్

# విద్యార్థినిపై వర్సిటీ దొరల ప్రతీకారం ?"

- కోర్టు ఆదేశించినా రాని హాల్ టికెట్.. రిజిస్ట్రార్, కంట్రోలర్‌పై ధిక్కరణ పిటిషన్.
- విద్యార్థిని భవిష్యత్తుతో చెలగాటం.. ఉస్మానియా వర్సిటీలో 'ధిక్కార' కలకలం.

**న్యాయస్థానం "హాల్ టికెట్ ఇవ్వు" అని ఆదేశిస్తే, వర్సిటీ దొరలు మాత్రం "మా మాటే శాసనం" అంటూ ధిక్కార రాగం అందుకున్నారట. చట్టం చదువుతున్న విద్యార్థినికే చట్టం విలువ తెలియజేయాలనే వారి తాపత్రయం చూస్తుంటే, కోర్టు తీర్పుల కంటే అధికారుల అహంకారమే గొప్పదన్నట్లు ఉంది. కంచె చేను మేసిన చందంగా, విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారే విద్యార్థి భవిష్యత్తుతో బంతిలాడుతుండటం విడ్డూరం. తప్పు చేసిన వారికి తీర్పుతోనే 'ట్రీట్మెంట్' ఇస్తే గానీ, ఈ విద్యా కుసుమాలకు న్యాయం జరగదు.**



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (భారత శక్తి): రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను బేఖాతరు చేస్తూ, ఒక విద్యార్థిని విద్యా భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారుల తీరు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

"కోర్టు ఉత్తర్వులను పాటించం" అంటూ బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులు బహిరంగంగా వ్యాఖ్యానించడం న్యాయ వ్యవస్థను సవాల్ చేయడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారిపై దాఖలైన ధిక్కరణ పిటిషన్ విద్యాశాఖలో ప్రకంపనలు సృష్టిస్తోంది.

**అసలేం జరిగింది?**

మలక్‌పేటకు చెందిన డాక్టర్ ఫౌజియా నిఖత్ ఓయూ లా కాలేజీలో ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టర్ చదువుతున్నారు. ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఆమెను అనుమతించాలని, తక్షణమే హాల్ టికెట్ జారీ చేయాలని ఈ నెల 29న హైకోర్టు (W.P. నం. 1907/2026) స్పష్టమైన తీర్పునిచ్చింది. అయితే, కోర్టు ఆర్డర్ కాపీని చేతబట్టుకుని అధికారుల చుట్టూ తిరిగిన సదరు విద్యార్థినికి చేదు అనుభవమే ఎదురైంది. విద్యార్థిని విన్నపాన్ని మన్నించాల్సింది పోయి, అధికారులు మొండి వైఖరి ప్రదర్శించడం గమనార్హం.

*** అధికారుల 'మొండి' వైఖరి వెనుక మతలబు ఏంటి?**

సాధారణంగా కోర్టు ఆదేశాలు వెలువడిన తర్వాత ఏ ప్రభుత్వ సంస్థ అయినా వాటిని అమలు చేయాలి లేదా పై కోర్టులో స్టే పొందాలి. కానీ ఇక్కడ అధికారులు అనుసరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది:

మౌఖిక ధిక్కరణ: "మేము కోర్టు ఆర్డర్ పాటించం.. స్టే తెచ్చుకుంటాం" అని అధికారులు సమాధానం ఇవ్వడం వారి అహంకారానికి నిదర్శనమని పిటిషనర్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇది ప్రత్యక్షంగా న్యాయవ్యవస్థ గౌరవాన్ని తగ్గించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కాలయాపన వ్యూహం: పరీక్షలు ఫిబ్రవరి 2న ప్రారంభం అవుతుండగా, జనవరి 30 వరకు హాల్ టికెట్ ఇవ్వకుండా తాత్సారం చేయడం వెనుక సదరు విద్యార్థినిని మానసికంగా కుంగదీసి, పరీక్షకు దూరం చేయాలనే కుట్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ఉల్లంఘన: 'అశోక్ చంద్ సింఘ్వి వర్సెస్ జోధ్‌పూర్ యూనివర్సిటీ' కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం విద్యార్థుల పక్షాన కీలక తీర్పునిచ్చింది. విద్యార్థి వైపు తప్పు లేనప్పుడు, కేవలం సాంకేతిక కారణాలు చూపి వారి విద్యా హక్కును కాలరాయకూడదని స్పష్టం చేసింది. ఓయూ అధికారులు ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడం వారి అజ్ఞానమో లేక ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమో అర్థం కాని పరిస్థితి.

**బోనులో కీలక అధికారులు:**

ఈ ధిక్కరణ కేసులో హైకోర్టు ఎవరిని బాధ్యులుగా పరిగణించనుంది అనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. పిటిషనర్ తన ఫిర్యాదులో ముగ్గురు కీలక వ్యక్తులను ప్రతివాదులుగా చేర్చారు:

1. డాక్టర్ గడ్డం నరేష్ రెడ్డి (రిజిస్ట్రార్, ఓయూ)
2. కె. శశికాంత్ (పరీక్షల నియంత్రణాధికారి)
3. ఎన్. రామ్ ప్రసాద్ (ప్రిన్సిపాల్, లా కాలేజీ)

*** స్వయంప్రతిపత్తి అంటే 'స్వేచ్ఛావిహారం' కాదు!**

యూనివర్సిటీలు స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలే అయినప్పటికీ, అవి భారత రాజ్యాంగానికి మరియు న్యాయస్థానాలకు లోబడి పనిచేయాలి. చట్టం చదువుతున్న విద్యార్థిని విషయంలోనే, చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఇలా ప్రవర్తించడం విద్యా వ్యవస్థలోని నైతిక పతనాన్ని సూచిస్తోంది. కోర్టు ధిక్కార చట్టం 1971 ప్రకారం, ఉద్దేశపూర్వకంగా ఉత్తర్వులను అమలు చేయని పక్షంలో అధికారులకు భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. పరీక్షలకు సమయం గంటల్లోనే ఉన్నందున, హైకోర్టు ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి 'స్పాట్ ఆర్డర్' ఇచ్చే అవకాశం ఉందని, తద్వారా అధికారులకు గట్టి హెచ్చరికలు జారీ చేయవచ్చని తెలుస్తోంది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.